# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | గురువారం 28-11-2019 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 105 | పేజీలు: 8 | వెల: రూ.1/-


## ఎస్పీజీని మరింత పటిష్టం చేస్తాం : అమిత్ షా

హైదరాబాద్, నవంబర్ 27: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఇవాళ లోక్‌సభలో స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూపు సవరణ బిల్లుపై మాట్లాడారు. బిల్లుతో కొత్త చట్టాన్ని అమలులోకి తెస్తామని మంత్రి షా తెలిపారు. గతంలో ప్రభుత్వాలు.. ఎస్పీజీ భద్రతను అవసరానికి తగినట్లుగా నిర్వీర్యం చేశాయన్నారు. మొదట్లో ఎస్పీజీని కేవలం ప్రధానిని రక్షించేందుకు క్రియేట్ చేశారన్నారు. ప్రభుత్వాధినేతలను కాపాడుకునేందుకు చాలా వరకు దేశాలు ఎలైట్ రక్షక దళాలను నిర్వహిస్తున్నాయని షా తెలిపారు. సవరణలతో ఎస్పీజీని మరింత పటిష్టం చేయనున్నట్లు మంత్రి చెప్పారు. గతంలో ఒక ప్రధానిని, ఒక మాజీ ప్రధానిని హత్య చేసిన తర్వాత ఎస్పీజీ భద్రతను ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ఎస్పీజీ భద్రతను మాజీ ప్రధానులకు, వారి కుటుంబాలకు కూడా కల్పిస్తామని, కానీ వాళ్లు ప్రభుత్వం కేటాయించిన నివాసంలో ఉండాలని, అలాంటి వారికి అయిదేళ్ల పాటు భద్రత కల్పిస్తామన్నారు.



శ్రీహరికోట నుంచి ఇస్రో చేపట్టిన పీఎస్ఎల్వీ సి-47 ప్రయోగంతో నింగిలోకి దూసుకెళ్లిన రాకెట్

## నింగిలోకి దూసుకెళ్లిన పీఎస్ఎల్వీ -సీ47

**- 26.50 నిమిషాల వ్యవధిలో కక్ష్యలోకి 14ఉపగ్రహాలు**

**- ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపిన ప్రముఖులు**

నెల్లూరు, నవంబర్27(ఆర్ఎన్ఎ) : పీఎస్ఎల్‌వీ సీ47 వాహకనౌక నింగిలోకి దూసుకెళ్లింది. భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన నెల్లూరు జిల్లాలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి ఈ ప్రయోగాన్ని బుధవారం ఉదయం 9.28గంటలకు చేపట్టారు. అనంతరం 26.50నిమిషాల వ్యవధిలో 14ఉపగ్రహాలను నిర్దేశిత కక్ష్యలో ప్రవేశ పెట్టనున్నారు. పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్-సీ47 ప్రయోగానికి మంగళవారం ఉదయం 7.28 గంటలకు కౌంట్‌డౌన్ మొదలైంది. ఈ ప్రక్రియ 26 గంటలపాటు సాగింది. లాంచింగ్ ప్యాడ్ నుంచి బయలుదేరిన పీఎస్ఎల్వీ 166 సెకెన్లలో తొలి దశ, 266 సెకెన్లలో రెండో దశ, ఎనిమిది నిమిషాల్లో మూడో దశను దాటుకుని చివరిదైన నాలుగో దశను విజయవంతంగా పూర్తిచేసింది. నిర్దేశిత కక్ష్యలోకి రాకెట్ చేరిన తర్వాత ఉపగ్రహాలు రాకెట్ నుంచి విడిపోయి నిర్దేశిత కక్ష్యలో చేరాయి. తర్వాత లాంచింగ్ కేంద్రం నుంచి బయలుదేరిన 26.51నిమిషాల్లో కార్టోశాట్‌ను నిర్దేశిత కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు. ప్రయోగం విజయవంతమైన తర్వాత కార్టోశాట్-3 నుంచి అంటార్కిటికాలోని ఇస్రో కేంద్రానికి సంకేతాలు అందుతాయి. మొత్తం 14ఉపగ్రహాలను నింగిలోకి పంపగా వీటిలో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన కార్టోశాట్-3, అమెరికాకు చెందిన 13 వాణిజ్య నానో ఉపగ్రహాలు ఉన్నాయి. కార్టోశాట్ ఉపగ్రహాన్ని భూమికి 509 కిలోమీటర్ల స్థిర కక్ష్యలో, 97.5 డిగ్రీల కోణంలో ఉంచారు. ఈ ఉపగ్రహ ప్రయోగంతో సరిహద్దుల్లో భద్రత మరింత పటిష్టమవుతుంది. పాక్ భూభాగంలోని ఉగ్ర స్థావరాలపై మెరుపుదాడులకు సహకరించిన రిశాట్ శ్రేణికి మించిన సామర్థ్యం ఈ ఉపగ్రహానికి ఉంది. మూడో తరం ఉపగ్రహంగా భావిస్తున్న కార్టోశాట్-3.. 25 సెం.మీ. హై రిజల్యూషన్‌తో ఫోటోలను తీయగలదు. సైనిక, ఉగ్రవాద స్థావరాలను మరింత స్పష్టంగా చూపగలదు. ఈ సందర్భంగా ఇస్రో ఛైర్మన్ శివన్ మాట్లాడుతూ.. ఈ అద్భుత ప్రయోగంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. మార్చి వరకు మాకు 13 మిషన్లు ఉన్నాయని, మాకు ఇప్పుడు చేతినిండా పని ఉందని, సందర్భానికి తగినట్టుగా సవాళ్లను ఎదుర్కొనేందుకు ఇస్రో సిబ్బంది సిద్ధంగా ఉన్నారని అన్నారు. ప్రయోగం విజయవంతం పట్ల తెలంగాణ సీఎం కేసీఆర్ ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. శాస్త్రవేత్తల కృషి, మేథోసంపత్తికి ఈ ప్రయోగం నిదర్శనం అన్నారు. ఇస్రో శాస్త్రవేత్తలకు ప్రధాని నరేంద్రమోడీ అభినందనలు తెలిపారు. మరోసారి జాతి గర్వించే కార్యాన్ని ఇస్రో విజవంతంగా నిర్వహించిదని చెప్పారు. ఎస్వీఎల్వీ-సీ47 కార్టోసాట్-3తో పాటు అమెరికాకు చెందిన పన్నెండు నానో సాటిలైట్లను కక్షలోకి ప్రవేశపెట్టింది. కార్టోసాట్-3 హై ఎండ్ రెజల్యుషన్ కలిగి ఉందని తెలిపారు. ఇది భారత రక్షణ వ్యవస్థలో కీలకంగా మారనుందని ప్రధాని చెప్పారు.

## మంచినీటి రిజర్వాయర్‌ను ప్రారంభించిన మంత్రి మల్లారెడ్డి



మేడ్చల్ మల్కాజ్‌గిరి, నవంబర్ 27: జిల్లాలోని శామీర్‌పేట్ మండలం జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి నేడు పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. లెప్రసి కాలనీలో 3.0 ఎంఎల్ జీఎల్ఎస్ఆర్(గ్రౌండ్ లెవల్ సర్వీసు రిజర్వాయర్) మంచి నీటి రిజర్వాయర్‌ను మంత్రి ప్రారంభించారు. అదేవిధంగా కాలనీలో సీసీ కెమరాలను ప్రారంభించారు. భద్రతాపరంగా ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని మంత్రి ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ యం.వి.రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అరుణ కుమారి, ఎమ్మార్వో నాగమణి, స్థానిక టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## చరిత్రలో నేటినిజం



కం॥ "జ్యోతిరావు ఫూలే"గా
జ్యోతులు గొన్నట్టి దివ్య శోభా మూర్తిన్
చేతము లో దలచు కొనుచు
చేతుల జోడించు చుంటి స్వాత్ముడనై!!

(నవంబర్ 28 జ్యోతిరావు పూలే పుణ్యతిథి)

-రాధశ్రీ

సెల్: 9494481210



## మాజీ నేవీ ఛీఫ్ అడ్మిరల్ సుశీల్‌కుమార్ మృతి

న్యూఢిల్లీ, నవంబర్27(ఆర్ఎన్ఎ) : భారత నావికాదళ మాజీ అధిపతి అడ్మిరల్ సుశీల్ కుమార్(79) బుధవారం ఉదయం ఢిల్లీలోని ఆర్మీ రిసెర్చ్ అండ్ రిఫరల్ ఆసుపత్రిలో తుది శ్వాస విడిచారు. కొద్ది కాలంగా ఆయన అస్వస్థతతో బాధపడుతున్నారు. ఇటీవలే ఆయన్ను ఈ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్చారు. ఆయన 1998 నుంచి 2000 వరకు భారత నావికాదళం ప్రధానాధికారిగా పనిచేశారు. తమిళనాడులోని నాగర్‌కోయిల్‌లో జన్మించిన సుశీల్ కుమార్ 1965, 1971లలో జరిగిన భారత-పాక్ యుద్ధాల్లో నావికాదళంలో ఆయన సేవలు అందించారు. దేశానికి ఆయన అందించిన సేవలకుగానూ పరమ విశిష్ట సేవా పురస్కారం, ఉత్తమ యోధ సేవా పురస్కారం, అతి విశిష్ట సేవా పురస్కారం వంటి అనేక గౌరవాలను అందుకున్నారు.

## కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల ఆందోళన

**- విధుల్లోకి చేరేందుకు డిపోల వద్ద బారులు**

**- బస్సులు బయటకు రాకుండా అడ్డగింత**

**- అడ్డుకున్న పోలీసులు.. కార్మికుల అరెస్ట్**

హైదరాబాద్, నవంబర్27(ఆర్ఎన్ఎ) : తెలంగాణలో ఆర్టీసీ కార్మికుల బతుకు పోరాటం కొనసాగుతోంది. విధుల్లోకి చేర్చుకోవాలని డిపోల ఎదుట కార్మికులు రెండో రోజు బుధవారం ఆందోళనకు దిగారు. రాష్ట్రవ్యాప్తంగా డిపోల వద్దకు కార్మికులు చేరుకొని తమను విధుల్లోకి తీసుకోవాలని అధికారులను విజ్ఞప్తి చేశారు. డిపోల వద్ద భారీగా మోహరించిన పోలీసులు పలువురు కార్మికులను అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు తాత్కాలిక సిబ్బందితో యథావిధిగా ప్రత్యామ్నాయ బస్సులు నడుస్తున్నాయి. తాత్కాలిక సిబ్బంది ఐడీ కార్డులు పరిశీలించాకే అధికారులు విధుల్లోకి అనుమతిస్తున్నారు. సికింద్రాబాద్ హకీంపేట డిపో వద్ద ఆందోళనకు దిగిన కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు. జేబీస్ వద్దకు పెద్దసంఖ్యలో చేరుకున్న కార్మికులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అదేవిధంగా ఆర్టీసీ కార్మికులు తమను విధుల్లోకి తీసుకోవాలంటూ ఖమ్మం ఉమ్మడి జిల్లాలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఖమ్మం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఒక్కసారిగా దూసుకొస్తున్న ఆర్టీసీ కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు. తమ డ్యూటీలు తమకు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. దీంతో పోలీసులకు, కార్మికులకు మధ్య తీవ్ర తోపులాట చోటు చేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండటంతో పోలీసులు సుమారు 60మందికి పైగా పోలీసులను అరెస్ట్ చేశారు. అదేవిధంగా ఖమ్మం బురాన్‌పురంలో ఆర్టీసీ కార్మికుల ఇళ్లలో పోలీసులు సోదాలు చేపట్టారు. ఓ ఇంట్లో సమావేశమైన ఐదుగురు మహిళా కార్మికులను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా సీఐటీయూ ఆధ్వర్యంలో హైదరాబాద్ కలెక్టరేట్ ముట్టడికి యత్నించారు. ఇదిలా ఉంటే సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్‌ల ముట్టడి చేపట్టారు.

## సెప్టెంబర్ నెల జీతాలు చెల్లించలేం

**- హైకోర్టుకు మరోసారి స్పష్టంచేసిన ప్రభుత్వం**

**- జీతాలివ్వకపోవటం చట్టవిరుద్ధమన్న కార్మిక సంఘాల తరపు న్యాయవాది**

**- విచారణ డిసెంబర్ 4కు వాయిదా వేసిన హైకోర్టు**

హైదరాబాద్, నవంబర్27(ఆర్ఎన్ఎ) : ఆర్టీసీ కార్మికులకు మరో షాక్ తగిలింది. సెప్టెంబర్ నెల జీతాలు చెల్లించలేమని ప్రభుత్వం మరోసారి హైకోర్టుకు స్పష్టం చేసింది. పేమెంట్ ఆఫ్ వేజెస్ యాక్టు - 7 ప్రకారం ఒక్క రోజు విధులకు హాజరు కాకుంటే ఎనిమిది రోజుల జీతం కట్ చేయవచ్చని ప్రభుత్వ తరపు పిటిషనర్ వాదించారు. బుధవారం హైకోర్టులో జీతాల చెల్లింపుపై విచారణ జరిగింది. ఈ సందర్భంగా కార్మికుల తరపు, ప్రభుత్వం తరపు న్యాయవాదులు వాదించారు. కార్మికులు 52 రోజులుగా సమ్మెలోనే ఉన్నారని కోర్టుకు దృష్టికి తీసుకొచ్చారు. జీతాల చెల్లింపుపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను హైకోర్టు ముందు ఉంచారు. పనిచేసిన సెప్టెంబర్ నెల జీతం ఇవ్వకపోవడం చట్ట విరుద్ధమని కార్మిక సంఘాల తరపు న్యాయవాది వాదించారు. కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఇరు వాదనలు విన్న హైకోర్టు..తదుపరి విచారణ డిసెంబర్ 4కు వాయిదా వేస్తున్నట్లు వెల్లడించింది. అక్టోబర్ 04వ తేదీ అర్ధరాత్రి నుంచి కార్మికులు సమ్మెలోకి వెళ్లిన సంగతి తెలిసిందే. దసరా పండుగ నేపథ్యంలో సమ్మెలోకి వెళ్లడంపై ప్రభుత్వం సీరియస్ అయ్యింది. సెల్ఫ్ డిస్మిస్ అయ్యారంటూ సీఎం కేసీఆర్ ప్రకటించిన సంగతి తెలిసిందే. విధుల్లోకి హాజరు కావాలని ప్రభుత్వం సూచించినా..కార్మికులు విధులకు హాజరు కాలేదు. దీంతో సెప్టెంబర్ నెలకు సంబంధించిన జీతాన్ని కార్మికుల ఖాతాల్లో జమ చేయలేదు. చివరకు తాము సమ్మె విరమిస్తున్నట్లు ఆర్టీసీ జేఏసీ ప్రకటించింది. విధుల్లోకి చేర్చుకోవాలని సూచించినా.. ఆర్టీసీ ఎండీ నిరాకరించారు. కోర్టు తీర్పు వచ్చేంత వరకు సంయమనం పాటించాలని సూచించారు. వేతనాలు అందక విధుల్లోకి తీసుకోకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా హైకోర్టు వ్యాఖ్యలపై ఆర్టీసీ జేఏసీ ఎలా స్పందిస్తుందో చూడాలి.

## నటుడు సంపూ కారును.. ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

**- ఆయనతో పాటు కుటుంబ సభ్యులకు స్వల్పగాయాలు**

**- సిద్ధిపేట పట్టణంలో ఘటన**

సిద్ధిపేట, నవంబర్27(ఆర్ఎన్ఎ) : నటుడు సంపూర్ణేశ్ బాబు రోడ్డు ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఆయన ప్రయాణిస్తున్న కారును ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో సంపూర్ణేశ్ బాబుతో పాటు కుటుంబ సభ్యులకు గాయాలయ్యాయి. సిద్ధిపేట పట్టణంలో కొత్త బస్టాండ్ సమీపంలో బుధవారం ఉదయం సమయంలో ఈ ప్రమాదం జరిగింది. సంపూర్ణేశ్ బాబు తన భార్య, పిల్లలతో కారులో ప్రయాణిస్తుండగా.. ఆర్టీసీ బస్సు ఆయన కారుని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సంపూతో పాటు ఆయన భార్య, కుమార్తెకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు ఘటనా స్థలికి వచ్చి సంపూర్ణేశ్ బాబుతో పాటు కుటుంబ సభ్యులకు సాయం అందించారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్థానికులు సమాచారంతో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు సంపూతో పాటు ఆయన కుటుంబ సభ్యులను ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సును తాత్కాలిక డ్రైవర్ నడపుతున్నట్లు తెలిసింది. దీంతో బస్సును నిలిపి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని పోలీసులు స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం.

## గవర్నర్ కోశ్యారీతో ఉద్ధవ్ థాక్రే దంపతుల భేటీ



మహారాష్ట్ర గవర్నర్ కోష్యారీని కలసిన ఉద్ధవ్ థాక్రే దంపతులు

ముంబయి,నవంబర్27(ఆర్ఎన్ఎ): శివసేన అధినేత ఉద్ధవ్ థాకరే, ఆయన భార్య రశ్మి ఉదయం రాజ్‌భవన్‌లో గవర్నర్ భగత్ సింగ్ కోశ్యారీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉద్ధవ్ థాకరేకు గవర్నర్ కోశ్యారీ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ నెల 28న సాయంత్రం 6:40 నిమిషాలకు మహారాష్ట్ర సీఎంగా ఉద్ధవ్ థాకరే ప్రమాణస్వీకారం చేయనున్నారు. శివాజీ పార్కులో ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక ఎన్సీపీ, కాంగ్రెస్, శివసేన ఎమ్మెల్యేలంతా కలిసి సీఎం అభ్యర్థి ఉద్ధవ్ థాకరేనే అని తెలుపుతూ.. గవర్నర్‌కు లేఖ అందజేశారు. ఫడ్నవీస్ తప్పుకోవడంతో మహా రాష్ట్రలో శివసేన -ఎన్సీపీ -కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగమం అయింది. ఫడ్నవీస్ వైదొలిగిన కొద్దిగంటల్లోనే సమావేశమైన శివసేన, ఎన్సీపీ, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ 'మహా వికాస కూటమి' నేతగా, ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఉద్ధవ్ ఠాక్రే (59)ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఠాక్రే పేరును ఎన్సీపీకి చెందిన జయంత్ పాటిల్ ప్రతిపాదించగా, కాంగ్రెస్ నేత బాలాసాహెబ్ థోరట్ బలపర్చారు.

## పేద, ధనికుల మధ్య భయానకమైన తేడా: ఆనంద్ శర్మ

హైదరాబాద్:, నవంబర్ 27 దేశ ఆర్థిక స్థితిపై ఇవాళ రాజ్యసభలో చర్చ చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ ఆనంద్ శర్మ మాట్లాడారు. దేశంలో పేద, ధనిక వర్గాల మధ్య భారీ తేడా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఆ తేడా చాలా భయానకంగా మారినట్లు ఆయన అభిప్రాయపడ్డారు.

ప్రస్తుత ఆర్థిక సంక్షోభం ఇండియాలోనే ఉందన్నారు. దేశంలో ఆర్థిక మందగమనం సాగుతోందన్నారు. గత ఏడేళ్లతో పోలిస్తే.. జీడీపీ 5 శాతానికి పడిపోయిందన్నారు. ఆటో, టెక్స్‌టైల్ రంగంలో సుమారు 25 లక్షల ఉద్యోగాలు కోల్పోయారన్నారు. నిరుద్యోగం 8 శాతం ఉందన్నారు. జాతీయ పెట్టుబడులు తగ్గాయని ఆనంద్ శర్మ అన్నారు. పరిశ్రమలు ఉత్పత్తి చేయడంలేదని, దానికి అనుగుణంగా ప్రభుత్వం కూడా ఖర్చు చేయడంలేదన్నారు. ప్రైవేటు రంగం వద్ద కావాల్సినంత పెట్టుబడి లేదన్నారు.

నోట్ల రద్దు చర్యను శర్మ తీవ్రంగా ఖండించారు. హడావుడిగా 2016లో నోట్ల రద్దు చర్యను చేపట్టారన్నారు. జీడీపీలో 40 శాతం వచ్చే అసంఘటిత రంగం దెబ్బతిన్నదన్నారు. 90 శాతం మంది ఉద్యోగాలు కోల్పోయారన్నారు. పరిశ్రమల నష్టాలకు నోట్ల రద్దే కారణమన్నారు. ప్రస్తుతం దేశ ఆర్థిక వ్యవస్థ బాగాలేదని, కానీ ప్రభుత్వం దీన్ని అంగీకరించడం లేదన్నారు. దివాళా నుంచి గట్టెక్కేందుకు పెద్ద కంపెనీలకు రుణ సహాయం చేస్తే, ఆ కంపెనీలు డబ్బును పెట్టుబడులకు వాడుకుంటున్నాయన్నారు. లాభాల బాటలో ఉన్న పీఎస్‌యూలను అమ్మేస్తున్నారన్నారు. కొన్నేళ్ల పాటు స్థిరంగా 9 శాతం అభివృద్ధి సాధిస్తేనే.. దేశ ఆర్థిక వ్యవస్థ 5 ట్రిలియన్ల డాలర్లుగా మారుతుందని శర్మ తెలిపారు.

## పౌల్ట్రీ రైతులను ఆదుకుంటాం: తలసాని

హైదరాబాద్,నవంబర్27(ఆర్ఎన్ఎ): మాదాపూర్ హైటెక్స్‌లో పౌల్ట్రీ ఇండియా సదస్సు ప్రారంభమైంది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరై ప్రసంగించారు. దేశంలో పౌల్ట్రీ రంగానికి మంచి భవిష్యత్ ఉందని మంత్రి తలసాని పేర్కొన్నారు. రాష్ట్రంలో పౌల్ట్రీ రంగాన్ని ఆదుకునేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. దాణాను సమయానికి విడుదల చేశామన్నారు. పౌల్ట్రీ రంగంపై ముఖ్యమంత్రి కేసీఆర్ మంత్రివర్గ ఉపసంఘం వేశారు. ఉత్తమ పాలసీ కోసం కృషి చేయాలని సీఎం ఆదేశించారని తెలిపారు. దేశంలోనే అత్యుత్తమ పౌల్ట్రీ విధానం తీసుకువస్తాం. తెలంగాణలో పౌల్ట్రీ రంగం ఉపాధి కల్పిస్తోంది. కోళ్ల రైతులకు సమస్య లేకుండా చూస్తాం అని మంత్రి తలసాని స్పష్టం చేశారు.

## చైన్ స్నాచింగ్‌కు విఫలయత్నం

హైదరాబాద్,నవంబర్27(ఆర్ఎన్ఎ): నగరంలోని చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్ చేయడానికి గుర్తు తెలియని దొంగ యత్నించాడు. గ్రీన్‌హిల్స్ కాలనీలో నివాసం ఉంటున్న లక్ష్మి(46) మహిళ కిరాణా షాప్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా హెల్మెట్ ధరించి బైక్‌పై వచ్చిన దొంగ మెడలోని పుస్తెల తాడు తెంపుకు పోయేందుకు యత్నించాడు. ఆమె కేకలు వేయడంతో దుండగుడు అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన సీసీటీవీ ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

## వాటర్ ట్యాంకర్ బీభత్సం- ఒకరు మృతి



హైదరాబాద్ ఎల్బీ నగర్ వద్ద డివైడర్ పైకి దూసుకుని వచ్చిన కారు

**స్కూటర్‌ను ఢీకొట్టడంతో ఒకరు మృతి**

**- ఎల్బీనగర్‌లో మెట్రో ఫిల్లర్‌ను ఢీకొట్టిన కారు**

**- ఇద్దరు మహిళలకు తీవ్రగాయాలు**

**- వరుస ప్రమాదాలతో బెంబేలెత్తుతున్న నగరవాసులు**

హైదరాబాద్, నవంబర్27(ఆర్ఎన్ఎ) : వరుస రోడ్డు ప్రమాదాలు భాగ్యనగరవాసులను భయపెడుతున్నాయి. గతవారం రోజుల నుంచి జరుగుతున్న ప్రమాదాలతో రోడ్ల మీదకు రావడానికే జనం బెంబేలెత్తిపోతున్నారు. బుధవారం ఉదయం ఎల్బీ నగర్ సమీపంలో కారు బీభత్సం సృష్టించిన ఘటనలో ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. ఇది జరిగిన కాసేపటికే కూకట్‌పల్లిలో మరో ప్రమాదం చోటుచేసుకుంది. ఓ స్కూటర్‌ను ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై ఉన్న వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందారు. ఎల్బీనగర్- దిల్‌సుఖ్‌నగర్ ప్రధాన రహదారిపై అన్‌లిమిటెడ్ మాల్ దగ్గర ప్రమాదం కారు బీభత్సం సృష్టించింది. అతివేగంతో దూసుకొచ్చిన కారు రోడ్డు దాటుతున్న ఇద్దరు మహిళలను ఢీకొట్టింది. అక్కడితో ఆగలేదు. ఆ వేగంతోనే కారు పల్టీలు కొట్టి.. మెట్రో డివైడర్‌ను ఢీకొట్టి ఆగింది. కారు యాక్సిడెంట్ లో గాయపడిన మహిళలను ఓజోన్ ఆసుపత్రికి తరలించారు. వారికి చికిత్స అందిస్తున్నారు. గాయపడ్డ మహిళలను వెంకటమ్మ, సత్తెమ్మగా గుర్తించారు. వీరిలో వెంకటమ్మ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. రంగంలోకి దిగిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కారు అతివేగంగా దూసుకురావడంతోనే యాక్సిడెంట్ జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. మరోవైపు కూకట్‌పల్లిలోని వసంత్‌నగర్ సమీపంలో వేగంగా వచ్చిన వాటర్ ట్యాంకర్.. స్కూటర్‌ను కొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో తీవ్రంగా గాయపడిన స్కూటర్‌పై వ్యక్తి ఘటనా స్థలిలోనే ప్రాణాలొదిలాడు. మృతుడు అయ్యప్ప సొసైటీకి చెందిన సయ్యద్ కాసిం(25)గా గుర్తించారు. కాసిం హోండా యాక్టివాపై వెళుతుండగా వాటర్ ట్యాంకర్ వెనుక నుంచి ఢీకొట్టి, అతడిపై నుంచి వెళ్లిపోయింది. దీంతో తీవ్రంగా గాయపడిన బాధితుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు నారాయణ కాలేజీలో పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసుల కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మంగళవారం బంజారా హిల్స్‌లో ఆర్టీసీ బస్సు ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను పొట్టనబెట్టుకుంది. బస్సును తాత్కాలిక డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడం వల్లే ఈ ప్రమాదం సంభవించింది. ద్విచక్రవాహనంపై వెళ్తున్న మహిళను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు.. 100 మీటర్ల వరకు ఈడ్చుకెళ్లింది. బస్సు చక్రాలు ఆమె తలపై నుంచి వెళ్లిపోవడంతో ఛిద్రమైంది. ఇంటి దగ్గర నుంచి బయలుదేరిన ఐదు నిమిషాలకే ఆమెను ఆర్టీసీ రూపంలో మృత్యువు వెంబడించింది. అటు, బయోడైవర్సిటీ ఫ్లై ఓవర్ వద్ద వారం వ్యవధిలోనే రెండు ప్రమాదాలు చోటుచేసు కున్నాయి. వేరొకరి నిర్లక్ష్యానికి ముగ్గురు బలయ్యారు. పైవంతెన అందుబాటులోకి వచ్చిన 20రోజుల్లోనే ముగ్గురు మృత్యువాత పడ్డారు. శనివారం జరిగిన ప్రమాదం హాలీవుడ్ సినిమాను తలపించిందని ప్రత్యక్ష సాక్షులు, సీసీటీవీ ఫుటేజ్‌లు వెల్లడిస్తున్నాయి. ఫ్లైఓవర్‌పై నుంచి గాల్లో ఎగురుతూ కిందపడిన కారు చెట్టుపై పడి కూలడం.. అక్కడ మహిళ చనిపోవడం క్షణాల్లో జరిగింది. అతివేగంతోపాటు నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ఎదుటివారి మృతికి కారణమవుతున్నారు. ఇలా గతకొంతకాలంగా వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలతో ప్రయాణీకులు భయాందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఎటునుంచి మృత్యువు ముంచుకొస్తుందోనని భయాందోళన చెందుతున్నారు.

### నవంబర్ 26 భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా

# అత్యుత్తమమైన భారత రాజ్యాంగం



- బి.ఎస్.రాములు
సామాజిక తత్వవేత్త
ఛైర్మన్, బీసీ కమిషన్, తెలంగాణ రాష్ట్రం
సెల్: 8331966987

1949 నవంబర్ 26వ తేదీన ప్రస్తుత భారత రాజ్యాంగం ఆమోదించబడి 1950 జనవరి 26 నుండి అమల్లోకి వచ్చింది. నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవంగా, జనవరి 26న భారత గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటున్నాము. భారత రాజ్యాంగం సమాజ పరిణామ చరిత్రకు ప్రతిబింబం. న్యాయ శాస్త్ర పరిభాషలో రాయబడే సమాజ పరిణామాలే రాజ్యాంగం, రాజ్యాంగ సవరణలు. విస్తారంగా, సమగ్రంగా అనేక రంగాలను, అంశాలను, విభాగాలను స్పష్టంగా పొందుపరచిన మహోన్నత పవిత్ర గ్రంథం భారత రాజ్యాంగం. భారత రాజ్యాంగంలో ప్రతి మనిషికి ఒకే ఓటు, ఒకే విలువ, ప్రాథమిక హక్కులు, ప్రజాస్వామిక హక్కులు, సమాన అవకాశాలు, సమాన అవకాశాలు అందుకోవడానికి సామాజిక న్యాయం స్వేచ్ఛాసమానత్వం, సౌభ్రాతృత్వం, ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవంతో జీవించ డానికి, సామాజిక న్యాయం ద్వారా, సామాజిక మార్పు సాధిస్తూ, శాంతియుతంగా సమాజం ముందుకు సాగడానికి అనేక లక్ష్యాలు పొందుపర చడం జరిగింది. ప్రపంచంలో భారత రాజ్యాంగం అత్యుత్తమమైనది.

అందరికీ సమాన అవకాశాలు, స్వేచ్ఛా సమానత్వం, సౌభాతృత్వం, ఆత్మగౌరవం ఆచరణలో అందేట్టు చేస్తూ అందుకు అవసరమైన ఏర్పాట్లు విద్య, నైపుణ్యాలు అందించే కృషి, వ్యవస్థలు వాటిని అందుకునేట్టు చేసే సంక్షేమ అభివృద్ధి వ్యవస్థలు ముందుకు సాగుతూ ఉండాలి. అప్పుడే ప్రతి ఒక్కరూ ఆనందంగా, సంతోషంగా, ఆత్మ విశ్వాసం, ఆత్మగౌరవంతో తమ అభిరుచులకు, అవకాశాలకు అనుగుణంగా ఎదుగుతారు.

ఆదేశిక సూత్రాలను సక్రమంగా అమలు చేయగలిగితే భారతదేశం సంక్షేమ రాజ్యం అవుతుంది. భారత రాజ్యాంగం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉండాల్సిన శాసనిక, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థల సంబంధాలను, కొత్త రాష్ట్రాల ఏర్పాటు గురించి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళా, బాలల గురించి, పౌరుల గురించి, వారి అభివృద్ధి, సంక్షేమం, సమాన అవకాశాలను అందుకోవడం కోసం చేయాల్సిన కృషి గురించి ఆర్టికల్స్‌లో పొందుపరిచి, ఎప్పటికప్పుడు అదనంగా చేరుస్తూ రావడం జరిగింది.

రాజ్యాంగం ప్రధానంగా మూడు స్తంభాలపై నిర్మించబడింది. 1) చట్టసభలు 2) పరిపాలనా యంత్రాంగం, 3) న్యాయ వ్యవస్థ. భావ ప్రకటనా స్వేచ్ఛను, పత్రికా స్వేచ్ఛను నాల్గవ స్తంభంగా పేర్కొంటారు. ఈ నాలుగు భారత రాజ్యాంగంలో 395 ఆర్టికల్స్ 22 పార్టులలో 101 రాజ్యాంగ సవరణలలో ఏదో ఒక రూపంలో కనపడుతుంటాయి. సుప్రీంకోర్టు భారత రాజ్యాంగ మౌలిక స్వరూపం గురించి ఇలా చెప్పడం జరిగింది.

1) రాజ్యాంగం సర్వోన్నతమైనది, 2) రూల్ ఆఫ్ లా, 3) అధికారాల పంపకాన్ని నిర్వచించే సూత్రం, 4) రాజ్యాంగ ప్రవేశికలో పేర్కొన్న లక్ష్యాలు, 5) న్యాయ సమీక్ష ఆర్టికల్ 32, 226, 227, 6) ఫెడరలిజం, 7) సెక్యులరిజం, 8) సర్వసత్తాక ప్రజాస్వామ్య గణతంత్ర వ్యవస్థ, 9) వ్యక్తి స్వేచ్ఛ, గౌరవం, 10)జాతీయ సమగ్రత, ఐక్యత, 11) సమానత్వ సూత్రం, 12) ప్రతి విషయంలో కాకపోయినా అందరికీ సమ న్యాయం, 13) మూడవ భాగంలోని ప్రాథమిక హక్కుల అంతస్సారం, 14) రాజ్యాంగం నాలుగో పార్టులోని ఆదేశిక సూత్రాలు, సంక్షేమం సాధించడానికి సామాజిక న్యాయం, ఆర్థిక న్యాయం, 15) ప్రాథమిక హక్కులకు, ఆదేశిక సూత్రాలకు మధ్య సమన్వయం, 16) పార్లమెంటరీ ప్రభుత్వ విధానం, 17) స్వేచ్ఛాయుత ఎన్నికల సూత్రం, 18) ఆర్టికల్ 368 ద్వారా చేసే రాజ్యాంగ సవరణకు పరిమితులు, 19) భారత రాజ్యాంగ పరిధికి లోబడి. న్యాయ వ్యవస్థ స్వాతంత్ర్యం, 20) న్యాయం అందించే కృషి, 21) ఆర్టికల్ 32, 136, 141, 142 ప్రకారం సుప్రీంకోర్టు అధికారాలు, 22) ఆయా ఆర్టికల్స్ ప్రకారం ఏర్పడే ట్రిబ్యునల్స్ ద్వారా కోర్టు తీర్పులను అధికారాన్ని తగ్గించే శాసనాలు. 23) సహేతుకత, 24) సామాజిక న్యాయం, 25) ఆర్టికల్ 21. 14, 19, 15, 14, 16(4), 4ఎ, 4బి ఆర్టికల్స్, 26) 20, 32 మొదలైనవి ఆర్టికల్స్ ఆదేశిక సూత్రాల అమలుకు సంబంధించినవి. (ఎస్సీ, ఎస్టీ, బీసీల గురించిన, ప్రాథమిక హక్కులకు సంబంధించిన 46వ ఆర్టికల్ చేర్చకపోవడం విచిత్రం. విచారకరం.) 27) రాజ్యాంగంలోని 3వ పార్టులోని ప్రాథమిక హక్కులకు, నాలుగవ పార్టులోని ఆదేశిక సూత్రాలకు మధ్య సమన్వయం, సహేతుకత సాధించడం.

భారత రాజ్యాంగంలో అతి ముఖ్యమైనవి మూడవ, నాల్గవ భాగాలు. మూడవ భాగం పౌరుల ప్రాథమిక హక్కుల గురించి, నాల్గవ భాగం ప్రభుత్వాలు సాధించాల్సిన లక్ష్యాలను, ఆదేశిక సూత్రాలను వివరిస్తాయి. మూడవ భాగం రాజ్యానికి హృదయం వంటిది. అవి అమలు పరచడానికి పౌరులకు లభించే వివిధ రాజ్యాంగ పరిష్కారాలను వివరించడం జరిగింది.

భారత రాజ్యాంగం ప్రవేశికతో మొదలవుతుంది. 42వ రాజ్యాంగ సవరణ చట్టం,

> "సామాజిక న్యాయం ద్వారా సామాజిక మార్పు జరగాలని భారత రాజ్యాంగ నిర్మాతలు, రాజ్యాంగ రూపశిల్పి డా॥ బి.ఆర్. అంబేద్కర్ భావించారు. ఇది సరిగ్గా సక్రమంగా సాగకపోతే సమాజం సంఘర్షణలకు, అంతర్యుద్ధాలకు దారి తీస్తుంది. అసమానతలు పెరిగిపోతాయి."

1976 తర్వాత రాజ్యాంగ ప్రవేశిక ఈ కింది విధంగా ఉంది.

"భారత ప్రజలమైన మేము భారతదేశాన్ని 'సార్వభౌమ, సామ్యవాద, లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర వ్యవస్థ'గా తీర్చిదిద్దటానికి చిత్తశుద్ధిగా తీర్మానించి ప్రజలందరికీ, సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని ఆలోచనలో, భావ ప్రకటనలో, విశ్వాసంలో, ఆరాధనలో స్వేచ్ఛను అందరికి హోదాను, అవకాశాలను పెంపొందించే సమానత్వాన్ని, వ్యక్తి గౌరవాన్ని, జాతి ఐక్యతను, సమగ్రతను నిర్ధారించే సౌభ్రాతృత్వాన్ని కలిగించడానికి మా రాజ్యాంగ సభలో 26 నవంబర్, 1949 నాడు ఈ రాజ్యాంగాన్ని స్వీకరించి, చట్టరూపం కల్గించి మాకు మేము సమర్పించుకుంటున్నాం".

భారత రాజ్యాంగం యొక్క ఈ అవతారిక రాజ్యాంగంలోని ఆర్టికల్స్ కన్నా ముఖ్యమైనది. భారత రాజ్యాంగ ఆత్మ ఇది. ఈ లక్ష్యాలు ఆదేశ సూత్రాల్లో పొందుపరచబడ్డాయి. అందువల్ల రాజ్యాంగ భూమిక ఈ ప్రస్తావన ఆదేశిక సూత్రాలే. ఆదేశిక సూత్రాలకోసమే, రాజ్యాంగ ప్రవేశిక కోసమే రాజ్యాంగం. ఆదేశిక సూత్రాల, ప్రవేశికల లక్ష్యాల విస్తరణే రాజ్యాంగం. అందువల్ల ప్రవేశిక ప్రియాంబుల్, ఆదేశిక సూత్రాలకు భిన్నమైనదేదైనా చెల్లుబాటు కాకూడదు. కొందరి ప్రాథమిక హక్కులకు, ఇతర సామాజిక వర్గాలకు మధ్య లక్ష్యాలకు మధ్య వైరుధ్యం ఏర్పడినప్పుడు ప్రాథమిక, మౌలిక హక్కుల కన్నా ఆదేశిక సూత్రాలు, లక్ష్యాలకు ప్రాధాన్యత ఇచ్చినప్పుడే సామాజిక న్యాయం.

భారత రాజ్యాంగంలో ఇండియా ప్రభుత్వ చట్టం 1935లోని అనేక అంశాలు యధాతథంగా చేర్చబడ్డాయి. దాంతోపాటు రాజ్యాంగ రూపకర్తలు ప్రపంచంలోని వివిధ రాజ్యాంగాలను అధ్యయనం చేసి, వాటిలోని తప్పులు, లోపాలను, కాలం తీరిన అంశాలు వదిలివేసి దేశీయ పరిస్థితులకు అవసరమైనవి, అత్యుత్తమమైనవి భారత రాజ్యాంగంలో చేర్చారు. అమెరికా రాజ్యాంగంవలె ప్రాథమిక హక్కులు, ఐర్లాండ్ రాజ్యాంగం అనుసరించి ఆదేశిక సూత్రాలు, జర్మన్ రిపబ్లిక్, ఇండియా ప్రభుత్వ చట్టం 1935ను అనుసరించి ఎమర్జెన్సీ విధివిధానాలు, బ్రిటీష్ చట్టాలను అనుసరించి పార్లమెంట్ నమూనా ప్రభుత్వం, దేశంలోని అనేక రాజ్యాలు, ప్రాంతాలు, భిన్న భాషలు, సంస్కృతి, భిన్న చారిత్రక పరిణామాలు అనుసరించి, సుదీర్ఘ రాజ్యాంగం, ప్రతి అంశం పట్ల నిర్దిష్ట ఆర్టికల్స్, విభాగాలు, అనేక చర్చలు సమన్వయంతో చేర్చడం జరిగింది. మూడవ విభాగంలోని ప్రాథమిక హక్కులు, నాల్గవ విభాగంలోని ఆదేశిక సూత్రాలు పరస్పర సంబంధంలో సమన్వయం సాధించాలి. కొందరు న్యాయమూర్తులు 1971 దాకా ప్రాథమిక హక్కులు ముఖ్యమని భావించారు. కాలక్రమంలో సామాజిక న్యాయం, సామాజిక అభివృద్ధి, సంక్షేమం, భారత రాజ్యాంగ మౌలిక లక్ష్యం అని న్యాయమూర్తులు గుర్తించడం జరిగింది.

సామాజిక న్యాయం ద్వారా సామాజిక మార్పు జరగాలని భారత రాజ్యాంగ నిర్మాతలు, రాజ్యాంగ రూపశిల్పి డా॥ బి.ఆర్. అంబేద్కర్ భావించారు. ఇది సరిగ్గా సక్రమంగా సాగకపోతే సమాజం సంఘర్షణలకు, అంతర్యుద్ధాలకు దారి తీస్తుంది. అసమానతలు పెరిగిపోతాయి. ఈ విషయాన్ని అంబేద్కర్ నొక్కి చెప్పారు. భారత రాజ్యాంగం ద్వారా అందరూ సమాన అవకాశాలు అందుకునేవిధంగా ఫెడరలిజం ద్వారా వికేంద్రీకృత అభివృద్ధి ద్వారా సైన్స్ టెక్నాలజీ, అభివృద్ధి ఫలాలు అందరికీ అందేవిధంగా ప్రభుత్వ, ప్రైవేటు సమస్త రంగాల్లో జనాభా దామాషా మేరకు అన్ని రంగాల్లో అవకాశాలు పొందగలిగినప్పుడే, అందుకోగలిగినప్పుడే భారత రాజ్యాంగం పూర్తిస్థాయిలో 135 కోట్ల ప్రజల ఆకాంక్షలను, అవసరాలను, అభిరుచులను నెరవేరుస్తుంది. అందుకు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, న్యాయవ్యవస్థ, మీడియా, శాస్త్రవేత్తలు, కళాకారులు, దార్శనికులు, సాహితీవేత్తలు అందరూ కలిసి కట్టుగా కృషి చేయడం అవసరం. అప్పుడే రాజ్యాంగానికి సార్థకత.

## రాజ్యాంగ విలువలకు బీజేపీ తిలోదకాలు

హైదరాబాద్, నవంబర్ 27 (ఆర్ఎన్ఎ):రాజ్యాంగం ఎంత గొప్పదైనా దానిని అమలు చేసే పాలకులు మకిలి చేష్టలకు పాల్పడితే అది అభాసు పాలుకాక తప్పదు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 70 ఏళ్ళు పూర్తవుతున్న సందర్భంగా దానిగురించి పాలకులు చాలా గొప్పగా అభివర్ణించారు. అంతకు ముందు రోజే రాష్ట్రపతి భవన్‌లో గవర్నర్ల సదస్సు జరిగింది. గవర్నర్ల పాత్రకు నీతులు ఆపాదించారు. పార్లమెంటులో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విపక్షం దీనిని బహిష్కరించిన వేళ మహారాష్ట్రలో చోటుచేసుకున్న పరిణామాలు రాజ్యాంగాన్ని అపహాస్యం చేసేవిగా, గవర్నర్ వ్యవస్థను అభాసుపాలు చేసేదిగా కనిపించాయి. బిజెపి వల్లించే నీతి సూత్రాలకు,ఆచరణకు ఏ మాత్రం పొంతనలేని వ్యవహారాలు జరగుతున్న తీరు సామాన్యులను కూడా కలవరపాటుకు గురిచేశాయి. మహారాష్ట్రలో శివసేనతో జట్టుకట్టి ఎన్నికలకు వెళ్లడం.. ఫలితాల అనంతరం జరిగిన పరిణామాలతో రాష్ట్రపతి పాలన విధించడం జరిగి పోయాయి. అయితే అక్రమాల కేసు మూటగట్టుకున్న అజిత్ పవార్‌ను నమ్ముకుని రాత్రికిరాత్రే గవర్నర్ పాలనను ఎత్తేసి, ఫడ్నవీస్ సిఎంగా ప్రమాణం చేయడం ఎంత అనైతికమో చెప్పక్కర్లేదు. బిజెపికి ఇది రుంచించ వచ్చేమో గానీ చూసే వారికి మాత్రం తీవ్ర ఆగ్రహం కలిగించేదిగా ఉంది. గవర్నర్ కోశ్యారి కూడా రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి విధులు నిర్వహించారు.

ఇంతటి అనైతిక రాజకీయాలు నడపడం ద్వారా బిజెపి ఎలాంటి సందేశం ఇవ్వదల్చుకుందో చెప్పాలి. మహారాష్ట్రలో అనైతికంగా, అప్రజాస్వామికంగా అధికారాన్ని చేజిక్కించుకునేందుకు బిజెపి పన్నిన ఎత్తులన్నీ సుప్రీం తీర్పుతో చిత్తయ్యాయి. అటు సుప్రీంకోర్టులోనూ, ఇటు ప్రజాబాహుళ్యంలోనూ ఆ పార్టీకి మొట్టికాయలు తప్పలేదు. బలనిరూపణకు ఈ నెలాఖరు వరకు గవర్నర్ సమయం ఇచ్చిన దరిమిలా కొనగోళ్లకు పాల్పడడం ద్వారా ప్రభుత్వాన్ని నిలుపుకోవాలని బిజెపి వేసిన ఎత్తులను సుప్రీం చిత్తుచేసింది. బుధవారం సాయంత్రం లోగా పడ్నవీస్ ప్రభుత్వం సంఖ్యాబలాన్ని నిరూపించుకోవాలని సుప్రీంకోర్టు తీర్పు వెలువరించడం, ఆయన రాజీనామా చేయడం అంతా క్షణాల్లో జరిగిపోయింది. అయితే ఈ ఘటనతో గవర్నర్ వ్యవస్థను,రాజ్యాంగ వ్యవస్థలను నిర్వచించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. మరోవైపు శివసేన-ఎన్‌సిపి- కాంగ్రెస్ కూటమి ఎమ్మెల్యేలంతా ఒక్కతాటిపై నిలిచి అసలు సంఖ్యాబలం తమదేనని నినదించారు. ముంబయిలోని ఓ స్టార్ హోటళ్లలో 162 మంది కూటమి సభ్యులతో పేరేడ్ నిర్వహించి ఫిరాయింపులకు పాల్పడబోమని ప్రమాణం చేయించడం ద్వారా తమ సంఖ్యాబలాన్ని ప్రపంచానికి తెలియచేశారు. తొలుత ప్రభుత్వం ఏర్పాటు చేయబోమని ప్రకటించిన బిజెపి అనైతికంగా ప్రభుత్వ ఏర్పాటుకు ముందుకు రావడం ద్వారా రాజ్యాంగ వ్యవస్థలను తుంగలో తొక్కింది. ఇలా అక్రమంగా గద్దెనెక్కి ప్రజాస్వామ్య విలువలకు పాతరేసి అధికార దాహంతో రాష్ట్రపతి, గవర్నరు కార్యాలయాలను సైతం దుర్వినియోగపర్చిన బిజెపి దేశ ప్రజలను క్షమాపణలు కోరాలి. ఎందుకంటే రాజ్యాంగం గురించి గొప్పగా నీతులు చెప్పిన నేతల కనుసన్నల్లోనే ఇదంతా జరిగింది. రాజ్యాంగ దినోత్సవం రోజునే ఈ పరిణామాలు చోటుచేసుకోవడం యాధృచ్ఛిమే అయినా బిజెపి కుట్రలు దేశాన్ని ఆశ్చర్య పరిచాయి. అజిత్ పవార్ బిజెపితో చేతులు కలిపేందుకు ఆసక్తి కనబర్చిన తర్వాతే తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని ఫడ్నవీస్ చెప్పడం సిగ్గుచేటు. ఆ పార్టీ ఎలాంటి లేఖ ఇవ్వకుండా ఎమ్మెల్యేల మద్దతు ఉన్నట్లు చూపకుండానే గద్దెనెక్కిన తీరు క్షమించరాని నేరం. బిజెపి పెద్దల ఆశిస్సులు లేకుండా ఇదంతా జరిగిందను కోరాదు. ఎందుకంటే ప్రమాణంచేసిన వెంటనే మోడీ సహా అంతా అభినందించిన వారే. ఎన్‌సిపి మొత్తం తమవైపు వస్తుందని భావించామని చెప్పుకోవడం సిగ్గుచేటు కాక మరోటి కాదు. శివసేన మళ్లీ నంబర్ గేమ్

ఆడుతోందని, ముఖ్యమంత్రి పదవికి సంబంధించి ఆ పార్టీతో ఒప్పందమేదీ తాము చేసుకోలేదని చెప్పిన వారు ఎందుకు ప్రభుత్వం ఏర్పాటుకు ఉత్సాహం చూపారో ప్రజలకు సమాధానం ఇచ్చుకోవాలి. నైతిక విలువలను, రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కడం ద్వారా బిజెపి రాజ్యాంగాన్ని అపహాస్యం చేసిందనే చెప్పాలి. సంఖ్యా బలం లేనందున తాము ప్రతిపక్షంలో కూర్చుంటామని, బాధ్యతాయుత ప్రతిపక్షంగా వ్యవహరిస్తామని చెప్పిన వారు ఎందుకు ప్రభుత్వ ఏర్పాటుకు ముందుకు వచ్చారో వివరణ ఇచ్చుకోవాలి.

రాజకీయ కొనుగోళ్ల నిరోధానికి సభలో బలనిరూపణ అవసరమని మహారాష్ట్ర తాజా రాజకీయ పరిణామాల పై మంగళవారం వెలువరించిన తీర్పులో సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసిన దరిమిలా ఇక భవిష్యత్ లో ఇలాంటి అనైతిక చర్యలకు పాల్పడకుండా చూడాలి. ప్రజాస్వామ్య విలువలను, మంచి పాలన కోరుకునే పౌరుల హక్కులను కాపాడేందుకు మధ్యంతర ఉత్తర్వులు వెలువరించటం అత్యవసరమని తాము భావిస్తున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది.

మొత్తంగా మహారాష్ట్రలో రేపు ఎవరు గద్దెనెక్కబోతున్నారన్న దానికంటే, ప్రజాస్వామ్యం దెబ్బతినిపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది. పదవీకాంక్ష నాయకులను దేనికైనా సిద్ధపడేట్టు చేస్తుందని అందుకు బిజెపి మినహాయింపుకాదని మహారాష్ట్ర పరిణామాలు సూచించాయి. అధికారాన్ని హస్తగతం చేసుకొనేందుకు గతంలో కాంగ్రెస్, ఇటీవల పలు రాష్ట్రాల్లో బీజేపీ అడ్డదారులు తొక్కడం ద్వారా తామేమీ అతీతులం కాదని కాషాయదళ నేతలు నిరూపించుకున్నారు.

రాజ్యాంగ నియమాలకు అనుగుణంగా వ్యవహరించి, విలువలను పరిరక్షించాల్సిన పెద్దలు ఈ మహానాటకంలో పోషించిన పాత్ర భారతదేశ చరిత్రలో చీకటి అధ్యాయంగా మిగిలిపోనున్నది.

## సప్త పదుల సహృదయ భారతి

సువిశాల లిఖిత భారత హృదయం
కాగితాల పొత్తం కాదది, రాజ్యాంగమే సుమా
జనావళి ఆకాంక్షల పరిరక్షణ ఛత్రం
భారతావని సౌందర్య జీవన వేదం
భిన్న దృక్పథాల అగ్రాసనం, ఐక్యవేదిక
హక్కులకే కాదు, ఉజ్వల భవితకూ చుక్కాని
అద్వితీయ ప్రజాస్వామ్య కరదీపిక
అనుపమాన జాతి ఆశ, శ్వాస, ఆయువు !

దిగ్గంతుల మూడేండ్ల మేథోమథన ఫలం
సమానత్వ భరోసా సంవిధాన శాసనం
రాజ్యాంగమేగా రాజ్యానికి అస్థిపంజరం
న్యాయస్వేచ్ఛసమానత్వసౌభాతృత్వాలే..
మూలస్తంభాలైన జాతి సగర్వ సౌధం
ప్రజాశ్రేయస్సే దాని ప్రథమ ధ్యేయం
సప్త పదుల సహృదయ భారతి పయనం !

వైఫల్యాలకు రాజ్యాంగమే కారణమా ?
అనైతిక ప్రజానీకం కారకులా ?
అవినీతి తల్లి వేర్లు కీచక రాజకీయాలుగా
స్వార్థమే పరమార్థమైన ఘడియ

వివేకభ్రష్టత్వ నేతాగణ రాజ్యంలో
అవినీతి అష్టపాదికి అంబారి కట్టి
'నల్ల'దొరల్ని సంకనెత్తుకొని
పేదరికం,ఆకలి,అనారోగ్యాల్ని పోషిస్తూ
జాతి నైతిక పతాకను అవనతం చేస్తున్నారు
విలువల వలువలనొలిచే దుశ్శాసనులు !

పౌర హక్కుల్ని పరిరక్షించుకుంటూ
జాతి జాడ్యాలకు విరుగుడును వెతికి
అరాచకీయ కసవును సమూలంగా ఊడ్చి
అవినీతి కలుపును కూకటివేల్లతో పీకి
సత్యానికి పాలకులు చెవులొగ్గి
జాతి స్ఫూర్తి వాడవాడలా పరిఢవిల్లేలా
రాజ్యాంగ జ్యోతికి గొడుగులు పడదాం !

(70 వసంతాల భారత రాజ్యాంగ స్ఫూర్తికి స్పందిస్తూ)



- డా॥ బుర్ర
మధుసూదన్ రెడ్డి
9949700037

## అంబేద్కర్ ఆశయాలకు తూట్లు

### దేశంలో ప్రజలకు దక్కని న్యాయం
### పాలకుల ఆలోచనల మేరకు నిర్ణయాలు

న్యూఢిల్లీ,నవంబర్27(ఆర్ఎన్ఎ):సంకీర్ణ ప్రభుత్వాల వల్ల అభివృద్ధి కుంటుపడుతున్నదనే ఉద్దేశంతో దేశ ప్రజలు రెండు దశాబ్దాల తర్వాత ఒకే పార్టీకి అంటే బిజెపికి స్పష్టమైన మెజారిటీ కట్టబెట్టారు. మోడీ అధికారంలోకి వస్తే సమస్యలు సమసిపోతాయని భావించారు. అలా అధికారంలోకి వచ్చిన వారు ఈ దేశంలో మౌలిక మార్పు తీసుకువస్తారని అందరూ ఆశించారు. కానీ పేద, మధ్య తరగతి ప్రజానీకం ఇబ్బందులు పడేలా ప్రస్తుత పాలనా విధానాలు ఉన్నాయి. నోట్ల రద్దుతో నల్లధనాన్ని అరికడతామని చెప్పిన వారు అసలు ఆర్థిక పతనాన్ఇన చూపించారు. దాని ఫలితంగా దేశంలో వేలాది చిన్న పరిశ్రమలు మూతపడ్డాయి. లక్షలాది మంది నిరుద్యోగులు అయ్యారు. విచిత్రమేమంటే నోట్ల రద్దు తర్వాతే గతంలో కంటే ఎక్కువగా నల్లధనం చెలామణీలోకి వచ్చిందని అధికార గణాంకాలే చెబుతున్నాయి. రాజ్యాంగంలో పేర్కొన్న విధంగా పనిహక్కు, ఉపాధి హక్కులన్నీ ఉత్తదే అని రుజువయ్యింది. రాజ్యాంగం విఫలమైతే రాజ్యాంగాన్ని నిందించవద్దని, దాన్ని అమలు చేసే వారిని నిందించాలని అంబేద్కర్ ఆనాడే అన్నారు. రాజ్యాంగం ఆధారంగా ఏర్పాటైన అన్ని ప్రభుత్వ వ్యవస్థల అధికారానికి మూలం ప్రజలే అని ఆయన స్పష్టీకరించారు. కానీ ఆయన ఆశలు వమ్మయ్యాయి. అంబేద్కర్ దూరదృష్టితో చేసిన ప్రయత్నాలను తుంగలో తొక్కుతున్నారు. ఆయన ఇగ్రహాలు పెట్టి దండలు వేయడం తప్ప ఆయన స్ఫూర్తిని ముందుకు తీసుకుని వెళ్లడంలో పాలకులు విఫలమయ్యారు. అంబేద్కర్‌ను బాగా పొగుడుతున్న బిజెపి కూడా అందరికన్నా ఎక్కువగా అవినీతి కార్యకలాపాలకు పాల్పడడం సిగ్గుచేటు. ప్రజలను విడిచి పాలనా వ్యవహారాలు సాగిస్తున్నారు. ఈంతో దేశంలో ఆర్థిక మాంద్యం ఏర్పడి ప్రజలు విలవిల్లాడుతున్నారు.

ప్రజాస్వామ్య పరిపాలన, స్వీయ అభివృద్ధి అనే లక్ష్యాలను నిర్దేశించుకొని పాలనా వ్యవస్థను భారతీయకరణ చేయాలని అంబేద్కర్ భావించారు. దేశ ప్రజలందరికీ సమానమైన విలువ, గౌరవం హక్కులు ఉన్నప్పుడే అది ప్రజాస్వామ్యం అవుతుందని ఆయన ఆశించారు. దీనికి అనుగుణంగానే ఆ మహానుభావుడు రాజ్యాంగాన్ని రూపొందించారు. నాటి నుంచి రాజ్యాంగంలో అనేక సవరణలు జరిగాయి. ప్రజల సంక్షేమమే ప్రాధాన్యంగా కొన్ని సవరణలు జరిగాయి. అందరికీ ఉచిత నిర్బంధ విద్య, ఉపాధి హామీ, ఆహార భద్రత, అణగారిన వర్గాలకు హక్కులు, మహిళలకు స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం వంటివి ఇందులో కీలకమైనవి. రాష్ట్రాఉ బలోపేతం అయితేనే దేశం బలోపేతమవుతుంది. కానీ ప్రస్తుత పరిస్థితులు రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగించేలా కనిపిస్తున్నాయి. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వారు రాజ్యాంగానికి కొత్త భాష్యాలు చెబుతున్నారు. మెజారిటీ వాదాన్ని వినిపిస్తున్నారు. దీన్ని ప్రశ్నించిన వారిపై దేశద్రోహులు అనే ముద్ర వేసి కేసులు పెడుతున్నారు. ప్రజా సంక్షేమం సంక్షోభంలోకి నెట్టబడింది. ఆదేశ సూత్రాల ప్రధాన లక్ష్యం రాజకీయ, ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పడం. కానీ నయా పాలకుల విధానాలతో ఇవ్వాళ దేశ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమైంది. దాని ఫలితం ఏమిటి అన్నది ప్రజలందరికీ అనుభవంలోకి వచ్చింది. కొత్తగా ఉద్యోగాల కల్పన లేదు. కానీ ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరిస్తున్నారు. కుటీర పరిశ్రమల స్థాపన అన్నది నినాదంగానే మిగిలిపోయింది. ఉన్న పరిశ్రమలన్నీ మూతపడుతున్నాయి. అంతిమంగా ప్రజలకు ఉద్యోగ భద్రత కరువైంది. పాలకులు అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు సరైనవి కావని ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ లాంటి వాళ్లు బహిరంగంగానే విమర్శలు చేశారు. ఆర్థికశాస్త్రంలో నోబెల్ గ్రహీత అభిజిత్ బెనర్జీ కూడా ప్రస్తుత పాలకుల విధానాలను తప్పుపట్టారు. వీటిని సమీక్షించాల్సిన పాలకులు ఆ పని మాని, విమర్శించినవారిపై తమ అనుయాయుల చేత వ్యక్తిగత విమర్శలు చేయించారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంబంధాల గురించి పేర్కొనే సమాఖ్య స్ఫూర్తి ఆచరణలో విఫలమైంది. ప్రణాళిక సంఘం స్థానంలో తెచ్చిన నీతిఆయోగ్ స్థాపన సమయంలో వల్లించిన ఆదర్శాలు కానరావడం లేదు. ప్రజాప్రయోజన పథకాలకు తగిన నిధులు కేటాయించాలని చేస్తున్న సిఫార్సులను కేంద్రం పట్టించుకోవడం లేదు. వ్యవస్థలను భ్రష్టు పట్టించి వ్యక్తుల కేంద్రంగానే రాజకీయాలు, ప్రభుత్వ విధానాలు కొనసాగుతుండటం ఆందోళనకరం. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే దేశం వందేళ్లు వెనక్కి వెళ్తుందనడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 70ఏళ్లు అవుతుందని గొప్పలు చెప్పుకుంటున్న తరుణంలో ఃాజ్యాంగ లక్ష్యం ప్రజల ఆశలు, ఆశయాలు, ఆకాంక్షలు ప్రతిఫలించడం లేదు. అందరికీ రాజకీయ ప్రాతినిధ్యంతో పాటు సామాజిక న్యాయం అందించడమే ప్రజాస్వామ్యం. భారత రాజ్యాంగం గొప్పదనం ఏమిటి అంటే అధికారంలో ఉన్నవాళ్లు రాజ్యాంగాన్ని అతిక్రమించడానికి వీలు లేకుండా ప్రాథమిక సూత్రాలను పొందుపరిచారు. ఉన్నతమైన ప్రజాస్వామిక పరిపాలన దేశానికి అందించాలనే లక్ష్యానికి ఇటీవలి కాలంలో తూట్లు పొడిచే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. వ్యవస్థలను దెబ్బతీస్తూ కొందరి ఆకాంక్షల కోసం ప్రజల ఆశలను వమ్ము చేస్తున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇందుకుఅతీంగా లేవు. అంతా కలసి తమవంతుగా ప్రజలను పీల్చి పిప్పి చేస్తున్న తీరు దారుణం కాక మరోటి కాదు.

## ఇచ్చిన మాట ప్రకారం గోదావరి జలాలు

### -డబుల్ ఇళ్ల నిర్మాణాలు: ఎమ్మెల్యే

మహబూబాబాద్,నవంబర్27(ఆర్ఎన్ఎ): ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన మాట ప్రకారం యాసంగికి సాగునీరు అందిస్తున్నామని డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. పాలేరు వాగుపై ఉన్న చెక్‌డ్యాం గోదావరి జలాలతో నిండి మత్తడి పోస్తున్నదని అన్నారు. చెరువులను గోదావరి జలాలలతో నింపుతున్నామని అన్నారు. సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 3 లక్షల నిరుపేద కుటుంబాలకు డబుల్ బెడ్ రూం ఇళ్ల కల నెరవేరుతున్నదని అన్నారు. డోర్నకల్ నియోజకవర్గానికి ఇప్పటికే 2500 డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరైనట్లు చెప్పారు. కొన్ని చోట్ల కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో వాటి నిర్మాణాలు అనుకున్న సమయంలో పూర్తి కావడంలేదని తెలిపారు. కుటుంబ సభ్యులంతా ఒకే దగ్గర ఉండేలా సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ చూపి నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లను మంజూరు చేసి నిర్మిస్తున్నట్లు చెప్పారు. అంతేకాకుండా సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు, కరెంట్ వసతిని కల్పిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వాలు పక్కా ఇళ్ల నిర్మాణం కోసం రూ.30 వేలు మాత్రమే ఇచ్చే వారని గుర్తు చేశారు. అయితే వాటిని కొందరు నిర్మించుకునేవారు మరి కొందరు అట్లనే వదిలేసిన సంఘటనలను వివరించారు. స్వరాష్ట్రంలో తెలంగాణ ప్రజలు ఇబ్బందులు పడొద్దని సీఎం కేసీఆర్ దేశంలోనే ఎక్కడా లేని విధంగా డబుల్ బెడ్ రూం ఇళ్లను నిర్మించి ఇస్తున్నారన్నారు వాటిని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు.

నా అంత మంచోడే లేడు
నాకన్నా మించి వెళ్లోడే లేడు
రెండూ ఒకటే...
ప్రత్యేకత చాటింపు ప్రక్రియ
అహంకార ప్రదర్శన

-మునిమడుగుల ఫిలాసఫీ

## మహారాష్ట్రలో బీజేపీ నీతిమాలిన చర్యలు

### అజిత్ లేఖతో రాజకీయ దిగజారుడుతనం
### అర్ధరాత్రి డ్రామాతో అభాసు పాలయిన కమలదళం

ముంబై,నవంబర్27(ఆర్ఎన్ఎ): మహారాష్ట్ర పరిణామాలు ప్రజల ఊహకు అందనంతగా ఉన్నాయి. రాజ్యాంగాన్నీ, ప్రజాస్వామిక విలువలను పరిరక్షించాల్సిన కీలకస్థానాల్లో ఉన్నవారంతా కలసికట్టుగా మోసం చేశారు. బిజెపి వ్యవహరించిన తీరు చూస్తే ఎన్నడయినా ఇంత దారుణం జరిగిందా అన్న ఆవేదన ప్రజల్లో కలిగిస్తున్నది. ఎన్సీపి ఎమ్మెల్యేలందరినీ బీజేపీ పక్షాన మోహరిస్తూ అజిత్‌పవార్ ఇచ్చిన మద్దతు లేఖ సాంకేతికంగా సరైనదా, ఆయనకు ఆ అధికారం ఉన్నదా లేదా అన్న వివేచన చేసుకోకుండా బిజెపి నేత ఫడ్నవీస్ సిఎంగా ప్రమాణం చేయడంఅన్నది రాజ్యాంగాన్ని నకాలరాయడం తప్పమరోటి కాదు. అది ఎవరికోసమో ఉద్దేశించినదనీ, అజిత్ పవార్ దానిని దుర్వినియోగం చేశాడని పవార్ పక్షం అంటున్నది.

శనివారం వేకువజామున సంభవించిన పరిణామాలు ఎవరూ ఊహించనివి. పవార్ ముందురోజు చెప్పిన ప్రకారం శివసేన, ఎన్సీపీ, కాంగ్రెస్‌లు కలసి ఉద్ధవ్ ఠాక్రే ముఖ్యమంత్రిగా సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటు ప్రకటించాల్సి ఉంది. ఈ మూడు పార్టీల మధ్యా కొద్దిరోజులుగా తీవ్ర స్థాయిలో సాగుతున్న మంతనాలు ఒక కొలిక్కి వచ్చి, ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించిన సంకేతాలు స్పష్టంగా ఇచ్చారు. ప్రజలు కూడా అదే జరుగుతందని అనుకున్నారు. కానీ, నిద్రలేచేసరికి ఎవరూ ఊహించని రీతిలో ముఖ్యమంత్రిగా ఫడణవీస్, ఉపముఖ్యమంత్రిగా బిజెపి రాజకీయ శత్రువు అజిత్ పవార్ పరమాణం చేశారు. శివసేన,కాంగ్రెస్,ఎన్సీపీలు ఒక్కటి కావడమే ప్రజాతీర్పును ఉల్లంఘించడమని బిజెపి ఎలా చెప్పగలుగుతుందన్నది ప్రశ్న. ఎన్నికలకు ముందు..ఎన్ఇనకల తరవాత అనేక పరిణామాలు చోటుచేసుకుంటున్న వేళ వీరి కలయికను తప్పుపట్టలేం.

అలా అనుకుంటే ఈ అర్ధరాత్రి పరిణామాలు ప్రజాస్వామిక సంప్రదాయాలను, ప్రక్రియలను నిలువునా పాతరేశాయని ఎవరిని అడిగినా చెబుతారు. అజిత్ పవార్ ఇచ్చిన లేఖలో పేర్కొన్నంత బలం తమపక్షాన వచ్చిచేరిందని బిజెపి పెద్దలంతా మనస్ఫూర్తిగా విశ్వసించిన పక్షంలో అంత త్వరగా సిఎం కుర్చీ కోసం వెంపర్లాడాల్సిన అవసరం ఏముందన్నదే ప్రశ్న. ఎన్సీపీ ఎమ్మెల్యేలంతా బీజేపీ పక్షానవుంటే, కొద్దిగంటల్లోనే పవార్ పక్కన, సోమవారం రాత్రి హోటల్‌లో నిర్వహించిన మీడియా పరేడ్‌లోనూ అంత పెద్దసంఖ్యలో ఎన్సీపీ ఎమ్మెల్యేలు ఎక్కడనుంచి వచ్చారన్న దానికి సమాధానం చెప్పాలి. మద్దతు లేఖలో గవర్నర్ కోషియారీకి కనిపించిన సంఖ్య క్షేత్రస్థాయిలో లేదన్న నిజాలు తెలియకకాదు. కేవలం కుటుంబ వైరాల నుంచి పుట్టిన ఈ లేఖ ఆధారంగా ఫడణవీస్ ఎలా సిఎం గద్దెను ఎక్కారన్నదే ప్రశ్న. రాష్ట్రపతి పాలన విధించడం, ఎత్తి వేయడం గతంలో కాంగ్రెస్ మాత్రమే చేయగలిగేది. ఇప్పుడు అదే దారిలో పయనించడం ద్వారా బిజెపి అనైతిక రాజకీయాలకు పాల్పడిందనే చెప్పాలి. మద్దు ఉందా లేదా అన్న జోలికి వెళ్లకుండా సుస్థిర పాలన అందించగలిగే ప్రభుత్వాన్ని ప్రతిష్ఠించాల్సిన గవర్నర్ మహారాష్ట్రలో ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కారు. రాష్ట్రపతి పాలన ఎత్తివేసేందుకు కేంద్రమంత్రివర్గ సిఫారసు ఉండాలన్న నిబంధనను దాటిపోవడానికి వీలుగా ప్రధాని తన అసాధారణ అధికారాలను ఉపయోగించి అనూహ్యమైన, అతిముఖ్యస్థి తిలో మాత్రమే వాడాల్సిన ఓ నియమాన్ని వెలికితీశారు. రాష్ట్రపతి మారుమాట్లాడకుండా ఉదయాన్నే గవర్నర్ పాలనను ఎత్తేస్తూ ఆమోదముద్ర వేయడం, ఆయన అసలు సంతకం లేకుండానే అధికారులు ఉత్వర్వులను అప్‌లోడ్ చేయడం, హోంశాఖ కార్యదర్శి డిజిటల్ సంతకం చేయడం వంటి పరిణామాలు ప్రజాస్వామ్యాన్ని మరింత ఖూనీ చేశాయి. ఇటువంటి సంక్షోభ సందర్భాల్లోనే ఎవరు విలువలను తుంగలో తొక్కారన్నది ప్రజలకు వేరుగా చెప్పాల్సిన పనిలేదు. సమస్త వ్యవస్థలూ భ్రష్టు పట్టిపోయాయనీ ప్రజలు తీవ్రంగా ఆలోచిస్తే ఏంజరుగుతుంది? ఇలాంటి పనులు ప్రజాస్వామ్యానికి చేటు తేగలవు. బిజెపి లాంటి పార్టీ ఇలాంటి నీతిమాలిన చర్యలకు పాల్పడడం ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారు.

## నిజాయి!

సం(some)పన్నులు ఎగవేస్తేనే-
సంపన్నులౌ తారేమో..భరత జగతిలో.
ఉన్నపుడు..లెఖ్ఖ..చేయవు-
పోయాక స్మృతులు మరువవునీతో చిక్కేలే.
కొడిగట్టనీకు మదిదీపం-
కరుణ చమురు కనిపెడ్తూ..కడవరకూ.
ఆర్ధ్రతకు ఆనవాళ్ళే లేవు-
శిలాజమైంది మది యుగాల రాపిడిలో.
చిటారుకొమ్మనుంటే విలువ-
సులువుగ దొరికే మిఠాయి పొట్లం వెగటే.
అంకురం వృక్షమై వనమెల్లా-
అక్షరం లక్ష్యమై జీవనమెల్లా.
కోర్కెలు నేలవిడిచి గాల్లో-
కృషీ,యత్నాలు విఫల ప్రయోగాల్లో.
శాంతి ..క్రాంతి-
యుద్ధానికి సరిహద్దులు.
ప్రతివ్యక్తీ సైనికుడే-
అనునిత్యం బ్రతుకు పోరాటం సాగిస్తూ.
ఉదయాస్తమయాలు..రంగులే-
రగిలితే వెలుతురు...పొగులితే చీకటి.
మనిషికి ప్రకృతి వరము-
తెలిసి మనగలగాలి ప్రతి ఒక్కరము.
భుజాలెందుకు తడుముకోడం-
దొంగలైతేనే కదా బెంగ.
గొంతెత్తి పాటందుకున్నా-
కోయిలలు కొలువుదీరాయి..శిష్యరికాన్కి.
నీలం నింగిదే-
అందం మెరుగులు దిద్దుతోంది సంద్రపు అద్దంలో



-డా॥గొల్లపెల్లి రాంకిషన్
9849693324.



# బాల వికాసం

బాలల దినోత్సవమును పురస్కరించుకుని సిద్దిపేట జిల్లా జక్కాపూర్ ఉన్నత పాఠశాలలో 'బాల కవి సమ్మేళనం' నిర్వహించడం జరిగినది. ప్రధానోపాధ్యాయులు రాళ్ళబండి పద్మయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు భైతి దుర్గయ్య నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయులు ఆసర్ల చెన్నకేశవులు, బి.దయానంద్ సరస్వతిగార్లు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి బహుమతులు అందచేశారు.

కవితా పఠనంలో పాల్గొన్న 26 మంది విద్యార్థుల కవితలు ఈవారం నేటినిజం పాఠకుల కోసం..

–సంపాదకులు

## నేనే మహారాణి

రైతు ప్రజలకు మహారాణి
ఎద్దు వ్యవసాయానికి మహారాజు
సైనికుడు ప్రపంచానికి మహారాజు
గురువు సమాజానికి మహారాజు
మేఘం పంటలకు మహారాజు
ప్రకృతి చెట్టు మహారాజు
ఒంటె ఎడారికి మహారాజు
నాన్న అనురాగానికి మహారాజు
అమ్మ మమకారానికి మహారాజు
ఈ కవితకు నేనే మహారాణి



–మట్టె ప్రసన్న
9వ తరగతి
జి.ప.ఉ.పా. జక్కాపూర్, సిద్ధిపేట

## చెరువు తల్లి

ఊరికి దేవత చెరువు
చెరువు లేకపోతే ప్రజలకు కరువు
చెరువులో నీరు ఉంటే
రైతు కళ్ళలో వెలుగు
వానలు పడితే వచ్చిన నీరు
చెరువులో నిలువ వుండు
చెరువులోని నీరుతో
రైతు పంటలు పండు
రైతు బాగుపడితే
దేశం ముందుకెళ్తుంది.



– ఎర్రం రక్షిత
9వ తరగతి
జి.ప.ఉ.పా. జక్కాపూర్,సిద్ధిపేట

## ఓటు విలువ

ఓ: ఓటర్ మహాశయా
నీవు వేసే ఓటు
చిమ్మ చీకట్లను చీల్చి
కాంతి రేఖ కావాలి
ఆ రేఖ నీ భవిష్యత్తుకు
ఆయుధం కావాలి
అన్యాయ రాజకీయాలను
అణచి వేయాలి
ఓ ఓటర్
నీవు ఓటు ఉపయోగించుకో
భవిష్యత్తు మార్చి రాసుకో.



– ఎర్రం. అంకిత్ రెడ్డి
10వ తరగతి
జి.ప.ఉ.పా. జక్కాపూర్, సిద్ధిపేట

## సూర్య చంద్రులు

ఈ దేశానికి సూర్యచంద్రులు
ఇద్దరే ఇద్దరు
ఒకరు రైతు, మరొకరు జవాను
రైతు లేకుంటే
తినడానికి మెతుకు ఉండదు
జవాన్ లేకుంటే
మన దేశానికి రక్షణ ఉండదు
ఈ ఇద్దరు లేని దేశం శూన్యం
అందుకే నినాదమివ్వాలి
జై జవాన్, జై కిసాన్.



– ఏదుల్ల రచన
10వ తరగతి
జి.ప.ఉ.పా. జక్కాపూర్,
సిద్ధిపేట

## అందమైన పువ్వు

ఓ అందమైనపువ్వా
నిన్ను నేను తెంపాలి అనుకున్నా
తెచ్చి పూజగదిలో పెట్టాలనుకున్నా
దేవునికి నువ్వు అలంకారం
పువ్వులు దేవుని మెడలో ఉండాలి
మనకు దేవుడు దీవెనలు ఇవ్వాలి
పువ్వులు పరమళించాలి
మన మనసులు వికసించాలి
పూజకి కావాలి పువ్వులు
మనిషికి ఉండాలి నవ్వులు.



– గూడేపు సౌమ్య
9వ తరగతి
జి.ప.ఉ.పా. జక్కాపూర్
సిద్ధిపేట

## సెల్ ఫోన్

సెల్‌ఫోన్ అంటే అందరికి ఇష్టం
దాని వలన అందరికి నష్టం
రేడియేషన్ వలన పక్షులు నశిస్తున్నాయి
దాన్ని చూడడం వలన
మన కనులు పోతున్నాయ్
చిన్నప్పటి నుంచే దానికి బానిసవుతున్నారు
దాని వాడకం తగ్గించాలంటే
మనం సెల్‌ఫోన్‌కి దూరం కావాలి
ఎక్కువ టవర్లు పెట్టకూడదు
మన పక్షులను రక్షించుకుందాం
పర్యావరణాన్ని కాపాడుకుందాం.

– కోంపల్లి కర్ణాకర్
8వ తరగతి
జి.ప.ఉ.పా. జక్కాపూర్
సిద్ధిపేట

## అమ్మ ప్రేమ

నన్ను పెంచావు అమ్మా
నా ప్రాణం నువ్వమ్మా
నీ పేగు తెంచి పుట్టానమ్మా
నీ రుణం ఎట్లా తీర్చుకోనమ్మా
నా కోసం మరుజన్మ ఎత్తవమ్మా
నీ కోసం ఎద్దైన చేస్తానమ్మా
నువ్వు లేకుంటే నేను లేనమ్మా
నువ్వే నా ప్రాణం అమ్మా
నన్ను నవమాసాలు మోసావమ్మా
నీకు నేను తోడుంటానమ్మ
నన్ను ఎత్తుకొని లాలించావమ్మా
నిన్ను కలకాలం గుర్తుంచుకుంటానమ్మా.

– నిమ్మల అశ్విత
9వ తరగతి
జి.ప.ఉ.పా. జక్కాపూర్
సిద్ధిపేట

## అన్నచెల్లెలి బంధం

అన్నచెల్లెలి బంధం
ఓ మధురమైన అనుబంధం
నీ ప్రేమ కరుగనిది
నీ రక్షణ దొరకనిది
అమ్మ లేకున్న–నాన్న లేకున్న
నీవు ఉన్నావన్న ధైర్యం ఉంది
అమ్మ, నాన్నల ప్రతిరూపం నీవే
మన మధురమైన బంధానికి
ఇలవేలుపు నీవే
నాకు రక్షణనిచ్చేది నీవే
నీ రుణం తీర్చగలనా???

– బొప్పు సాత్విక
8వ తరగతి
జి.ప.ఉ.పా. జక్కాపూర్, సిద్ధిపేట

## పావురం

పావురం అంటే అందరికి ఇష్టం
కాని దానిని పట్టుకోవడం కష్టం
అప్పట్లో అదే మనకు పోస్టుమ్యాన్
అది గుర్తు పెట్టుకుంటుంది దాని స్థలం
ఎక్కడ వదిలిన అది చేరుకుంటుంది
దాని గమ్యం
దానికి ఉంటుంది చిన్న మెదడు
మనకన్నా ఎక్కువ ఉంటాయి జ్ఞాపకాలు
అందుకే ఎక్కడికి వెళ్ళినా ఇస్తుంది ఉత్తరాలు
శాంతిదూత గాంధీగారు అన్నారు
అది శాంతికి రూపమని.

– జి. రఘువర్ధన్ రెడ్డి
8వ తరగతి
జి.ప.ఉ.పా. జక్కాపూర్
సిద్ధిపేట

## నా పల్లె

నేను పుట్టిన మా పల్లె
అదే నా పాలిటా తొలిజల్లు
నా పల్లె ప్రకృతి పచ్చదనం
నా పల్లె ఆరోగ్యానికి శుభప్రదం
నా పల్లెలో అందమైన చెరువు
వాటిలో విరబూసిన తామరలు
నా పల్లె చెరువులో అలలు
నా పల్లెలో పక్షుల కిలకిలలు
నా పల్లె చూడడానికి రెండు కళ్ళు చాలవు
ఇది నా అందమైన పల్లె.

– బాదవేని శ్రీజన
8వ తరగతి
జి.ప.ఉ.పా. జక్కాపూర్
మం।। నారాయణరావు పేట
జిల్లా।। సిద్ధిపేట

## అందం

అమ్మాయి ముఖానికి బొట్టందం
చేతులకు గాజులందం
కాళ్ళకి పట్టీలు అందం
చెవులకు దుద్దులు అందం
కళ్ళకి కాటుక అందం
ముక్కుకి ముక్కెర అందం
మెడలో గొలుసు అందం
అమ్మాయికి వినయం అందం
ఓ ఇంటికి ఇల్లాలు అందం
ఈ ప్రపంచానికి అమ్మాయే అందం.



– ఎర్రం. అఖిల
10వ తరగతి, జి.ప.ఉ.పా.
జక్కాపూర్, సిద్ధిపేట

## ప్రకృతి వరం

ఇల్లు మనకు రక్షణ ఇస్తుంది
చెరువు మనకు నీరు ఇస్తుంది
గోవు మనకు పాలు ఇస్తుంది
ప్రకృతి మనకు అందాన్ని ఇస్తుంది
చెట్లు మనకు పండ్లను ఇస్తుంది
స్నేహితులు మనకు సహాయం చేస్తారు
ప్రకృతి మనకు ప్రాణం ఇస్తుంది
సూర్యుడు మనకు వెలుగు నిస్తాడు
చంద్రుడు మనకు వెన్నెల నిస్తాడు
అమ్మ, నాన్నలు మనకు జన్మనిస్తారు.



– దుర్గం అక్షయ
9వ తరగతి
జి.ప.ఉ.పా. జక్కాపూర్,
సిద్ధిపేట

## కాలుష్యం

బండిని నడపండి
కాని తక్కువ నడపండి
అది మనకు ఇస్తుంది కాలుష్యం
దానితో వస్తుంది క్యాన్సర్
అది వస్తే మనకే నష్టం
ఆ తరువాత మనకే నష్టం
అది రావద్దని ప్రయత్నిద్దాం
మనం దాని గురించి ఆలోచిద్దాం
మనమే దానిని ఆపుదాం
బండి వాడకం తగ్గిద్దాం.

– సారుగు అరవింద్
8వ తరగతి
జి.ప.ఉ.పా. జక్కాపూర్
సిద్ధిపేట

## గురువు

చదువు నేర్పేది గురువు
తలరతను మార్చేది గురువు
అమ్మ ప్రేమ తరగనిది
గురువు చెప్పిన చదువు కరుగనిది
గురువు లేనిదే–చదువు లేదు
చదువు లేనిదే– మా భవిష్యత్తు లేదు
గడియారంలోని ముల్లు ఆగనిది
మీరు చెప్పే విద్య ఎనలేనిది
మీ జీవితంమాకో సోపానం
తీర్చగలమా మేము మీ రుణం.



–కయ్యాల అక్షయ
8వ తరగతి
జి.ప.ఉ.పా. జక్కాపూర్
సిద్ధిపేట

## సమాజం

అమ్మ ప్రాణం పోస్తుంది
బడి చదువు నేర్పుతుంది
ఇల్లు ఉండడానికి చోటు ఇస్తుంది
ప్రకృతి అందాలని ఇస్తుంది
వెలుగు దారిని చూపుతుంది
నీరు దాహాన్ని తీరుస్తుంది
చెట్టు నీడనిస్తుంది
గాలి శ్వాసనిస్తుంది
సమాజం ఎలా బతకాలో చెబుతుంది.



– కన్నం ఇందుప్రియ
9వ తరగతి
జి.ప.ఉ.పా. జక్కాపూర్
సిద్ధిపేట

## రెండు అక్షరాలు

రెండు అక్షరాల పదం అమ్మ
కనిపించే దేవత అమ్మ
మాటలు నేర్పించేది అమ్మ
జోల పాటలు పాడేది అమ్మ
గురువుతో సమానం అమ్మ
మనలని పోషించేది అమ్మ
ఆకాశంలో ఇంద్రధనస్సు అమ్మ
ఆత్మీయతకు మారుపేరు అమ్మ.

– బోయిని. చామంతి
9వ తగతి
జి.ప.ఉ.పా. జక్కాపూర్,
సిద్ధిపేట

## పబ్‌జీ

పబ్‌జీ అంటే అందరికీ ఇష్టం
దాని పరిణామాలు ఎంతో కష్టం
అది ఆడితే మజా వస్తుంది
దాని వలన పిచ్చి ఎక్కుతుంది
పబ్‌జీ ఎందుకు
చాలా పుస్తకాలు ఉండగా
చదువుకొని అవుదాం గొప్పవాళ్ళం
పబ్‌జీ ఆడకుండా బడికి వెళుదాం
వద్దే వద్దు పిచ్చి ఆటలు
మంచి చదువే మనకు అందం

– ఎన్. అఖిల్
8వ తరగతి
జి.ప.ఉ.పా. జక్కాపూర్,
సిద్ధిపేట

## ప్రకృతి అందం

ఈ ప్రపంచానికి ప్రకృతి అందం
ఈ ప్రకృతికి పచ్చదనం అందం
పచ్చదనానికి మా పల్లె అందం
మా పల్లెకు మా అమ్మ అందం
మా అమ్మకు నేను అందం
నాకు నా చదువు అందం
చదువుకి పిల్లలు అందం
పిల్లలకు మా బడి అందం
మా బడికి మా గురువు అందం
మా గురువులకు మేము అందం.



– ఏదుల్ల రమ్య
10వ తరగతి
జి.ప.ఉ.పా. జక్కాపూర్,
సిద్ధిపేట

## ఆది దేవత

లోకంలో మంచి అమ్మాయిలు ఉండరేమో
మంచి తల్లి మాత్రం ఉంటుంది
ఈ లోకాన్ని సృష్టించిన దేవుడు
జన్మనిచ్చిన తల్లి సమానమే
కాని తల్లి ఆ దేవునికంటే
ఒక మెట్టుపైనే ఉంటుంది
ఎందుకో తెలుసా
అమ్మ సృష్టికి ఆది దేవత.



– కోలపురం అనూష
10వ తరగతి
జి.ప.ఉ.పా. జక్కాపూర్,
సిద్ధిపేట

## కనిపించే దైవం

మనకు చదువు చెప్పేది గురువు
మనల్ని తీర్చిదిద్దేది గురువు
మనల్ని మంచి దారిలో నడిపించేది గురువు
మనల్ని ప్రయోజకులుగా చేసేది గురువు
కనిపించని ప్రతిరూపం దేవుడు ఐతే
కనిపించే ప్రతిరూపాలు తల్లితండ్రి గురువు
మనము ఎంత గొప్ప స్థాయికి చేరినా
మనల్ని తీర్చిదిద్దిన గురువుని మాత్రం
ఎప్పటికి మరవవద్దు.



– కొంపెల్లి వంశీ
10వ తరగతి
జి.ప.ఉ.పా. జక్కాపూర్,
సిద్ధిపేట

## నాన్న

నాన్న, ఓ నాన్న
నీ మనసు వెన్న
అమృతం కన్నా
నీ మనసు ఎంతో మిన్న
నీతో గడిపిన ప్రతీక్షణం
మరపురాని మధుర జ్ఞాపకం
నా గెలుపుకు నీవే సోపానం
ఎన్ని యుగాలు మారినా
ఎన్ని తరాలు దాటినా
నీ రుణం తీర్చగలనా.

– బోయిని అఖిల
8వ తరగతి
జి.ప.ఉ.పా. జక్కాపూర్,సిద్ధిపేట

## ఎర్ర బస్సు

మా ఊరికి వచ్చింది ఎన బస్సు
ఎంతో మంది అవసరాలు తీరుస్తుంది
ఈ ఎర్ర బస్సు
కులబేధాలు లేనిదే ఈ ఎర్ర బస్సు
మనకు ప్రశాంతాన్ని ఇచ్చే
ఈ ఎర్ర బస్సు
అనుబంధాలు కలిపేది ఈ ఎర్ర బస్సు
అందరికి అందుబాటులో ఈ ఎర్ర బస్సు
చెయ్యి ఎత్తిన చోట ఆపేది
ఈ ఎర్ర బస్సు
పల్లెటూర్లకి పరుగున వచ్చేది
ఈ ఎర్ర బస్సు
తక్కువ ధరతో తీసుకెళ్ళేది
ఈ ఎర్ర బస్సు
మన అందరికి నచ్చేది
ఈ ఎర్ర బస్సు.

– నిరుగొండ చందన
9వ తరగతి
జి.ప.ఉ.పా. జక్కాపూర్
సిద్ధిపేట

## నాన్నే ప్రత్యేకం

కన్నతల్లి లేకపోతే రోడ్డుమీద
ఎవరినైనా అమ్మ అని పిలిచి
బంధాన్ని కలుపుకోవచ్చు
కానీ నాన్న అనే పిలుపు
ఒకసారి దూరమైతే గుండెలు
పగిలేలా ఏడ్చినా
దిక్కులు అరిచేలా పిలిచినా
బదులురాదు ఎందుకంటే ఆ
పిలుపు రక్తం పంచిన
తండ్రికి సొంతం ఇది
నాన్నకు మాత్రమే ప్రత్యేకం.



– ఏదుల్ల రిష
10వ తరగతి
జి.ప.ఉ.పా. జక్కాపూర్. సిద్ధిపేట

## గొప్ప శక్తి

చలికి వనకుతూ
ఎండకు ఎండుతూ
వానకు తడుస్తూ
రైతు పడే కష్టం
మనందరి కోసమే కదా
ఊరిలోన మనముంటాము
ఊరి చివరన రైతుంటాడు
పాడి పంటలు పండించే రైతు
కష్టించి శ్రమించే రైతు
ఈ దేశానికి గొప్పశక్తి.

– బచ్చుపల్లి శ్రీనిధి
8వ తరగతి
జి.ప.ఉ.పా. జక్కాపూర్, సిద్ధిపేట

## పూల బాట

నీ మాట వజ్రాల మూట
నీ పాట పూల తోట
నీ మనసు తేనెల ఊట
నువ్వు నా బంగారు కోట
నీ నడక వెన్నెల బాట
నీవే నారక్షణ కోట
నీ ప్రేమ నాకు జోల పాట
నీ కోసం వేస్తాను పూల బాట.

– చింతల రవి
8వ తరగతి
జి.ప.ఉ.పా. జక్కాపూర్, సిద్ధిపేట

## రక్షణ

అడవి మనకు రక్షణ ఇస్తుంది
పాఠశాల మనకు విద్యనిస్తుంది
నదిమనకు నీరును ఇస్తుంది
ఉపాధ్యాయుడు మనకు విజ్ఞాన్ని ఇస్తాడు
స్నేహితులు మనకు తోడు నిస్తారు
చంద్రుడు మనకు వెన్నెల నిస్తాడు
దేవుడు మనకు వరం ఇస్తాడు
ఊరు మనకు ఐక్యత ఇస్తుంది.



– చీర్నపల్లి నరేష్
10వ తరగతి
జి.ప.ఉ.పా. జక్కాపూర్, సిద్ధిపేట



జక్కాపూర్ ఉన్నత పాఠశాలలో 7-11-19న నిర్వహించిన బాల కవి సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు.



# సహజత్వం ఉట్టిపడిన కవిత్వం "మనిషికి మరోవైపు"








మనుషుల్ని అనేక రకాలగా పరిశీలించి, సమాజంలో అనేక దుస్సంఘటనలపై దృష్టినిలిపి మనోవికలమై, జరుగుతున్న అన్యాయాలకు, సమాధానం లేని అనేక ప్రశ్నలకు సరైన దారిగా కవిత్వాన్ని ఎంచుకున్న కవి శివ మంచాల. తొలి గ్రంథమైనా ఏమాత్రం ఆ ఛాయలు కనిపించకుండా తీర్చిదిద్దిన కవిత్వం ఇది. బంగారు పళ్ళానికైనా గోడదాపు అవసరం అన్నట్లు, ఈ కవి చేసిన, చేస్తున్న ప్రయత్నాలను ప్రోత్సహిస్తూ, గ్రంథ ముద్రణ స్థాయికి వీరిని తీసుకుని వచ్చిన సహృదయ కవి మిత్రులు దొరకడం వీరి అదృష్టం.

శీర్షికతోనే కవిత్వం దాదాపుగా అవగాహనకు వచ్చేస్తుంది. అంటే కవిత్వ లోతులు అని చెప్పను కానీ కవి ఆంతర్యం బోధపడుతుంది. నాణానికి మరోవైపు ఉన్నట్లే మనిషికి కూడా మరోవైపు ఖచ్చితంగా ఉంటుంది. అసలు మనిషంటేనే రెండు ఆలోచనల స్వరూపం. రెండు నాలుకల నైజం. ఆ విషయాన్ని ఖచ్చితంగా ఎరిగిన శివ కవిత్వంలో కాస్తంత ఆవేశమే ప్రదర్శించారు. ముఖ్యంగా ఈ గ్రంథం దీర్ఘకవితా అనుకుంటే కాదు. వివిధ రకాల వస్తువులతో ఉంది. కానీ వేటికీ ప్రత్యేకించి శీర్షికలను ఉంచలేదు. ఇదో కొత్తదనం. బావుంది. **"నీకోసం నేను నా ఇజాన్ని అమ్ముకోను/ నమ్ముకున్న సిద్ధాంతాన్ని వదులుకోలేను/ ఎప్పటికైనా అవినీతిపై విజయం నిజాయితీదే"** అనడంలోనే వీరి స్వతంత్ర్య వ్యక్తిత్వం మనకు బోధపడుతుంది. వ్యక్తిత్వాన్ని నమ్ముకున్నంత కాలం మనం మనంగానే నిలిచిపోతాం. వ్యక్తిత్వాన్ని అమ్ముకున్న వారంతా నిత్యం అస్తిత్వం కోల్పోతూ తమను తాము పూర్తిగా కోల్పోతారు అనే విషయాన్ని వీరు తమ భావాల్లో వ్యక్తీకరిస్తారు.

**"ఎన్నోచోట్ల మనం మనిషికి / మరోవైపున్న చీకటి/ శక్తులతో వ్యతిరేకంగా పోరాడుతూనే ఉంటాము/ బలహీనులు వాటితో పోరాడలేక ఓడిపోతుంటారు/ బలవంతులు విజయం సాధిస్తుంటారు"** అంటారు మరోచోట. బలం అంటే ఇక్కడ కండబలం కాదు బుద్ధిబలం. పోరాడి గెలవడం వీరుల లక్షణం. పోరాడి గెలవడం బలహీనుల అలసత్వం. గెలుపయినా, గుర్తింపు అయినా మంచికి వస్తుంది. చెడుకి వస్తుంది. కానీ మరణించినా మనిషి ఉనికిని చాటేది మాత్రం ఖచ్చితంగా మంచే అనే అభిప్రాయాన్ని వీరు నమ్ముతారు.

మనిషి ఎందుకు ధర్మాన్ని పాటించరు? మనిషి ఎందుకు న్యాయం వైపు ఆలోచించరు? సాటి మనిషి ఆకలిని, అవసరాన్ని ఏమీ ఎందుకు గుర్తించరు? అంటూ అనేక అంశాలపై ఆవేదనను వ్యక్తం చేసారు. ఒక్కోచోట ఆవేదన తారాస్థాయికి చేరి **"మీ పాపం ఊరికే పోదు, మదమెక్కిన పందికొక్కులు మీరు"** అంటూ ఆవేశపడ్డారు. శివ గారి కవిత్వంలో నిజాయితీ ఉంది. నేను కవిని కనుక వేదన చూపాలి అనే కృత్రిమత్వం లేదు. సాటి మనిషి బాగుపడాలని, మంచితనంతో బాగుపడాలని, అక్కడక్కడా మనకు ఎదురైన మానవత్వాన్ని, మనిషి తత్త్వాన్ని కాపాడాలని ఎంతో తపన పడతారు. **"నేను రేపటి శూన్యం/ కనిపించని భౌతికం కాదు/ నేను శూన్యం నింపిన శూన్యం"** అంటారు. ఇక్కడ మనిషికి మిగిలేది ఏమీ లేదు. ఆ వాస్తవాన్ని మనం గుర్తించాలని చెపుతారు.. సరే.. ఇవన్నీ వదిలేద్దాం అనుకున్నా, ఎవరు ఎలా పోతే నాకేం అనుకున్నా **"కనిపించేదంతా భ్రమ అని ఎలా అనుకోను;/ కనిపించనిది ఉందంటే ఎలా నమ్మను?/ నమ్మకానికి కొలమానం ఏదైనా ఉందా?/ నమ్మకపోవడానికి రుజువుగా ఏదైనా కనిపిస్తుందా?"** అంటూ వాపోతారు. మన కంటిముందు ఇంతటి ఘోరాలు జరుగుతుంటే ఎలా నాది కాదని ఉండగలను? అని భాధపడతారు. కవి అంతే! ఏదైనా చూస్తూ ఊరుకోలేడు. మనది కాదు కదాని పక్కనుంచి తప్పించుకుని పోలేడు. **"మనసు చంపుకుని మౌనంగా/ఎన్నాళ్ళు ఉండమంటావ్/ అవినీతిని చూస్తూ నోరెత్తకుండా/ఎలా ఉండగలనంటావ్/ న్యాయం వైపు నన్ను మాట్లాడనివ్వు..!"** అనేదే వీరి కవితా సారాంశం.

మనిషి మనిషే.. లేకుంటే లేదని, ఉంటే ఇంకా కావాలని, బాగుపడితే ఎందుకు బాగున్నారని, బాగలేకుంటే మంచిగా అయ్యిందని నిత్యం ఆరాట పడుతూనే ఉంటారు. కులం వద్దంటారు. కుల గోడలకే ప్రాధాన్యం ఇస్తారు. మతం లేదంటారు మంది తక్కువైతే వాడుకుంటారు. కాకుంటే నీతి, నియమాలు ఎప్పుడో గాలిలో దీపాలయిపోయాయి.

కనీసం నిజాయితీ కాస్తయినా ఉంటే బావుంటుంది కదా అనేదే వీరి ఆంతర్యం. శివ గారు తన మొదటి అడుగులోనే ప్రకంపనాలు సృష్టించారు. ఇలాగే అనేక అడుగులు పడి తెలుగు కవిత్వానికి వీరి కలం మరింత దోహద పడాలని కోరుకుంటూ వీరి తొలి ప్రయత్నానికి అభినందిస్తున్నాను

ప్రతులకు:
శివమంచాల
సెల్: 9833232579
వెల: 150/-

## దాంపత్య అంతఃసూత్రం

పంచభూతాలతో కావాలి
మనిషి సాంగత్యం పరిపూర్ణం.
ఎదురీదితే తప్పవు కష్టాలు.
దాంపత్య జీవనయానానికి
ఇదే అంతఃసూత్రం!
ప్రయత్నం చేసే వారికే సాధ్యం
ప్రత్యామ్నాయాలు.
ఆలుమగల నడుమ
నిత్యం కొత్తపొద్దు పొడిచేది
నిర్ణాయక క్రియాశీల భాగస్వామ్యంతోనే!
బడబాగ్నులున్నా బయటకు పొక్కవు
బంధం లోతైతే.
నిశ్చలమైన జీవన శైలికి నిలువెత్తు అందం
నియమనిష్ఠల పాలనే.
నొసటి రాతలు, లక్ష్మణ రేఖలు
మనిషి సృష్టే!



**- ఆచార్య కడారు వీరారెడ్డి**
9392447007

## గ్రంథ సుగంధం.. పుస్తకం మస్తక భూషణం

వాడే కొద్దీ తరిగేది నిధి
పంచే కొద్దీ పెరిగేది జ్ఞాన నిధి

చిన్నప్పుడు పుస్తకాలు తెరచి వాసన చూసేటోళ్లం
కమ్మల్లో దాగిన పరిమళం ఇప్పటికి వీడిపోలేదు
పుస్తకాల్లో దాచుకున్న నెమలీక
రంగు మారనేలేదు
మదిలో పదిలమే మరి!!

బడిపంతులు చెప్పిన అక్షరాలు,శతక పద్యాలు,
ఎక్కాలుతడుముతూనే ఉంటాయి
ఆ గ్రంథాలలోని మాధుర్యం
మరచిపోలేని విజ్ఞాన నిధే

మన పూర్వీకుల మసిష్కం నుండి
జాలువారిన ఎన్నో విజ్ఞాన వీచికలు
తాళపత్రాలు ఆనాడు
ప్రచురణ అయినవి ఈనాడు
మారుతున్న కాలం
అగ్గిపెట్టెలో పట్టే పుస్తకాలు
ఎన్నో విషయాలు
ఎన్నెన్నో గ్రంథాలు
జుర్రుకున్న వాళ్లకు
జుర్రుకున్నంత సుగంధం!!

మనిషి మనీషిగా మారినా మనిషిగా మారినా
ఉగ్రవాదిగా మారినా రాక్షసునిగా మారినా
భక్తునిగా మారినా
రక్తునిగా మారినా
వేదాంతిగా మారినా
నవరస భరితమైన సాహిత్యమే కదా!!

విజ్ఞాననిధులు పుస్తక బాండాగారాలు
జ్ఞాన వైభవానికి చిహ్నాలు
ఎన్నో ఏళ్ల వివిధ పత్రికలకు ఆనవాళ్లు
వైభవానికి తార్కాణాలు!!

సాంకేతిక పరిజ్ఞానమెంత
రెక్కలు తొడిగినా
తరగని గ్రంథ పరిమళాలు
పెరిగిన గ్రంథాలయాలు
మానవ మేధకు సోపానాలు!

పుస్తకం హస్త భూషణం కాదు
మస్తక భూషణం కావాలి!!



**-డా.చీదెళ్ళ సీతాలక్ష్మి**
99490367383

## కైతికాలు

మొదట శ్రవణం చేయాలి
మననం చేయాలి
తర్వాతనే మనము
ఆలోచన చేయాలి
వారెవ్వా ఓర్పు
పనిలో నుండును నేర్పు

పెండ్లికి కావాలిప్పుడు
వర కట్న కానుకలు
ఇవి లేకుంటే కావు
కన్యల పెండ్లిళ్లు
వారెవ్వా కట్నం
ఇవ్వకుంటే జరుగదు లగ్గం

పెండ్లి లకు దూబారా
ఖర్చులు చేస్తున్నారు
ధనవంతులైన వారు
పేదలు జంకుతున్నారు
వారెవ్వా పెండ్లిళ్లు
పేదల బాధలు

పెండ్లి వికృత రూపం
ధరించింది నేడు
పేద కుటుంబాలకు
దెబ్బ తీస్తున్నది నేడు
వారెవ్వా పెండ్లి తంతు
ఆడంబరాలకు పోకపోతే మేలు



**-జాధవ్ పుండలిక్ రావు**
9441333315



# మధురమైన "గజల్ గీతికలు"




ఒక అరబ్బు దేశంలో "గజ్జల్" అనే కవి తన జీవితమంతా ప్రణయాన్ని గూర్చి, సౌందర్యాన్ని గూర్చి, కవితలు రాస్తూ గడిపడమే కాకుండా ప్రణయ కలాపాల్లో అతడు జీవితం వెళ్ళదీసాడట. ఆ రచయిత పేరు 'గజ్జాల్" కనుక, ప్రణయ కవితకు 'గజల్' అనే పేరు వచ్చింది. గజ్జెల చప్పుడు ఎంత సున్నితంగా ఉంటుంది కనుక అతి కోమలమైన భావాల ప్రకటనే "గజల్" అన్నారు కొందరు. ప్రాచీనంలో గజల్ కంటే ఆధునికంలో గజల్ పరిధి మరింత విస్తృతమైనది. సాంఘీక, రాజకీయ, సాంస్కృతిక, నైతిక, ఆర్థిక, మతైక విషయాలు సైతం నేడు గజల్ లో చోటుచేసుకుంటున్నాయి. గజల్ రచనలో విశ్వశనీయత ఉంది. ఏ భాషలో రాసినా, అనువదించినా, పాఠకుడిని ఆకట్టుకునేలా ఉంటుంది గజల్. గజల్ లోని ప్రత్యేకత ఏమిటంటే లక్ష్యార్థం ప్రాధాన్యం వహించడం.

కవిత్వం ఏ రూపంలో ఉన్నా అది కవిత్వమే. సున్నితమైన, బహు తక్కువ పదాలతో అనల్ప అర్థాన్ని తెలియజేయడమే గజల్ ఉద్దేశ్యం, పటేలు అనంతయ్య తమ గజల్స్‌ని సూది మొన కిందపడితే కలిగే శబ్ధం లా సున్నితంగా ఉంటాయి. ఈ పటేలు అనంతయ్య గజల్స్ కాస్తంత ఆలోచనలకు పని కల్పించేలా సాగడం విశేషం. ఉదాహరణకు కొన్ని గజల్స్ ను గమనించండి..

**"ఆశ సూర్యుడు మెరిసె నైరాశ్య రాత్రి / కాని, వేకువే హృదయాన కానరాదు"**

**"విరిసె పూవులు హృదయమే విప్పుకొనదు/ నడి వసంతాన శిశిరము నడుచు చుండె!"**

**"నేను నిట్టూర్చ తగులును నింద నాకు / ఆమె హతమార్చ మాటైన అడగబోరు"**

**"ప్రణయ వైద్యుడు నను జూచి పలికె నిట్లు/ కాంక్ష తీరని రుగ్మత కమ్మెనిన్ను"**

**"నోట రాదాయె కోర్కెల సున్నమాట/ వలపు వీక్షణమూ కాంక్ష తెలుపు తనకు"**

అనంతయ్య ఈ గజల్ రచనను ప్రవేశము, ప్రణయము, ఆమని, మగువ, మధువు, మధుశాల, ఖేదము, స్వర్గం, ప్రళయం, మిశ్రమము అంటూ పదకొండు భాగాలుగా విభజించడం జరిగింది. ముఖ్యంగా అనువాదంలో ఎంతో సౌందర్యం దాగుంది. 'భరీ బహార్" ను నడి వసంతం అనడం ఎంతో బావుంది. అలాగే ఖజా గుహర్ రహీహై అనే పదాన్ని శిశిరము నడుచుకుండె అని అనువాదం చేయడం ఎంతో సంస్కారవంతంగా ఉంది. ముఖ్యంగా గజళ్ళలో దాదాపుగా వినిపించే మాటలు మధువు, మగువ, పానపాత్ర, పానశాల, సంకేతాలు మాత్రమే. మధువు ఆత్మ. మధు పాత్ర ఆత్మను వ్యక్తీకరించే సాధనం అంతే. మగువ అంతర్యామి. మసీదు భగవత్ స్వరూపం. ప్రణయంలో పరమాత్మ సాక్షాత్కారాన్ని మనం గమనించగలము. ఈ గ్రంథంలో అద్భుతమైన కవులు ఇక్బాల్, మీర్, గాలిబ్, అసద్, ఫానీ, దాగ్ వంటి వారు కనిపించడం నిజంగా హర్షించదగినది. తేటగీతుల్లో అందించిన ఈ కవితలకు తొడిగి మరింతగా అలంకరించిన ఈ అనంతయ్య నిజంగా అనంతమైన, అరుదైన కవి. అభినందనలు.

ప్రతులకు: తెలంగాణ సాహిత్య అకాడమి
ఫోన్: 040-29703142
వెల: 30/-

పుస్తక సమీక్షలు



# ఆదర్శవంతమైన కథలు 'సంస్కృతి మందారం'






ఒకరి మంచి మరొకరు అణుమాత్రం కోరని తత్త్వం, ఒకరి బాధను లేసమాత్రం అర్థం చేసుకోలేని నైజం బలంగా అల్లుకుపోయిన ఈ సమాజంలో మానవ విలువలు ఎక్కడ్నించి వస్తాయి? మహనీయులు ఎలా జన్మిస్తారు? జన్మించినా ఈ స్వార్థం నిండిన సమాజంలో ఎలా జీవిస్తారు? బంధాలన్నీ నేడు ముడి పదార్థాలే. స్నేహం అవసరార్థం. ప్రేమ కాలక్షేపం. పెళ్ళి వ్యాపారం. ఇలాంటి వాతావరణంలో మనిషి ఊపిరాడక, తనకేమి కావాలో తానే నిర్ణయించుకోలేక, తప్పులపై తప్పులు చేస్తూ, తప్పుల్ని ఒప్పులు చేయడానికి మరికొన్ని తప్పులు చేస్తూ జీవితమంతా తప్పుల తడకలుగా సాగించే ఈ సమాజానికి స్వాంతన లేదు. ఇలాంటి అయోమయ స్థితిలో ఉన్న మానవాళికి ప్రేమ కథలు రచించి అందించిన దారం గంగాధర్ అభినందనీయులు. ఇదివరలో ఏడుకథలతో ఒక సంపుటి రావడం జరిగింది. ఈ సంపుటిలో మూడు పెద్ద కథలున్నాయి. ఈ కథల్లో మూడు పురుష, మూడు స్త్రీ పాత్రలు ఉన్నాయి. వీటిలో చాలావరకు మూడు పురుష పాత్రల ద్వారానే వ్యక్తీకరించారు. ప్రేమ, బంధం, దాంపత్యం, మారుతున్న మానవీయ విలువలు, అమానవీయ సమాజం స్త్రీలను ఎలా బాధపెడుతోందో వివరించిన తీరు ఎంతో ఆదర్శవంతంగా ఉంది.

కథ అంటేనే విలువల్ని కాపాడేది. పోగొట్టుకున్నవి అందించేది. కథకు పాత్రల ఔచిత్యం, తీర్చిదిద్దాల్సిన నైపుణ్యత ఉండాలి. వాటికి ఏ లోటూ లేకుండా ఈ కథలను ఈ రచయిత తీర్చిదిద్దారు. సంస్కృతి కథలో అనురాగ్, అంజలి వరసకు బావామరదళ్ళు. వీరిరువురు విద్యార్థి దశ నుండే ఒకరినొకరు ఇష్టపడ్డారు. కుటుంబ సభ్యులు కూడా అంగీకరించారు. అనురాగ్ పెద్ద చదువులు చదివి ఉద్యోగం సంపాదించుకుని ఇంగ్లాడుకు వెళ్ళాడు. అక్కడ తను చేసే కంపెనీ యజమాని కూతురు కల్పనాపాటిల్, అనురాగ్ పట్ల ఎంతో ఆకర్షితురాలై , ఎంత సన్నిహితంగా ఉండాలని ప్రయత్నిస్తుంది. కానీ అనురాగ్ లొంగకుండా బాల్యం నుండి తాను ప్రేమించిన అంజలినే పెళ్ళి చేసుకోవడంతో కథ ముగుస్తుంది. ప్రపంచంలో అనేక చోట్ల ఎదురయ్యే మనో వికారాలను ఎలా తప్పించుకోవాలో తెలిపిన కథ ఇది. ప్రేమ అనే పదానికి ఎంతో విలువనిచ్చి దాన్ని కాపాడుకోవాలని చెప్పిన కథ.

రెండో కథ "అద్దె గర్భం" ఈ కథలో రెండు పార్శ్వాలున్నాయి. మొదటిది ఇందులో నాయక పాత్రను జోగిని వృత్తిలోనికి నెట్టడం అందులోనుంచి కథానాయకుడు ఎలా తప్పించాడు అనేది. రెండవది ఆ వృత్తిలోంచి బయటపడి "అద్దెగర్భం' మాయలో పడి సంపాదనకు ఎగబడి సంసారాన్ని ఎంతగా ఛిన్నాభిన్నం చేసుకుని ఎలా జీవితాన్ని ముగించుకుందో అనేది. స్త్రీని మూఢనమ్మకాల నుండి కాపాడగలమేమో కానీ, ఈ ధనాశ నుండి కాపాడలేమో అనేది తెలిపే కథ ఇది. నేడు కేవలం డబ్బు సంపాదనకోసమే శరీరాల్ని ఛిన్నాభిన్నం చేసుకుంటున్న మహిళలకు ఒక హెచ్చరిక.

మూడో కథ "మిస్సుడ్‌కాల్". అనుమానంతో చక్కని జీవితాల్ని ఎలా నాశనం చేసుకున్నారో తెలియజెప్పే కథ ఇది. సూర్యతేజ అనే అతనికి తన ఆఫీసులో పనిచేసే నీరజ "మిస్సుడ్‌కాల్" ను చూసి తప్పుగా అర్థం చేసుకుని వదిలి భార్య పుట్టింటికి వెళ్ళిపోవడం, విడాకులు తీసుకోవడం కూడా జరిగిపోతుంది. దాంతో సూర్యతేజ ఎంతో బాధపడతాడు. ఇలాంటి సమయంలో మరో కాల్ తన జీవితంలోకి ప్రవేశిస్తుంది. ఆ కాల్‌లో కాలయాపన చేయడం అలవాటు పడిన సూర్యతేజ ఆమెను చూడటానికి వెళితే ఆమె పెద్ద వయసుగల ఆవిడ కావడంతో తన జీవితంలో జరిగిన సంఘటనల్ని తెలుపుకుని సలహాలు తీసుకుని వెళుతుంటే ఎదురుగా భార్య రావడం, తనకోసమే సూర్యతేజ తన వివరాలు తెలుసుకుని వచ్చాడని అనుకుని, తన తొందరపాటును గ్రహించి క్షమాపణలు కోరడంతో కథ సుఖాంతమవుతుంది. ఒక తప్పును తప్పుగా తెలియపరచకపోవడం, కూతురు విడాకులు కావాలంటే వెంటనే ఇప్పించేయడం, కూతురు గర్భవతి అని తెలుసుకుని కూడా విషయం తెలుపకుండా తన స్వార్థం కోసం కూతురు జీవితాల్ని మట్టుపెట్టడం ఇటీవల సాంప్రదాయంగా మారింది. ఇలాంటి సంఘటనలు సమాజంలో కోకోల్లలు. కానీ భార్యాభర్తలు అనేవారు ఎప్పటికైనా ఒకటేనని నిరూపించడంలో ఈ రచయిత చేసిన ప్రయత్నం హర్షణీయం.

రచయిత గంగాధర్ తెగిపోతున్న బంధాలను ముడివేయాలని, కృత్రిమమైన ఆకర్షణలకు లోనుకావడం తప్పు అని, విలువలు కోల్పోతున్న ప్రేమను మరింత కాపాడాలని చేసిన ప్రయత్నం ఈ కథలు. వీటిని మలచడంలో ఎంతో కృషి చేసారు. వీరికి అభినందనలు.

ప్రతులకు: దారం గంగాధర్,
ప్రశాంత నిలయం, 5-11-121,
నిజామాబాద్-503 001
సెల్: 9848384777. వెల: 100/-



# దహించుకుపోతున్న 'దగ్ధ పల్లవుల పాట'






సమాజ పరంగా జరుగుతున్న దోషాలను, లోపాలను, ఆవేదనతో ఎలుగెత్తి ప్రశ్నించే మరో దీర్ఘకవిత ఇది. దగ్ధపల్లవుల పాట అనే పేరులోనే ఎంతో ఆవేదన ఉంది మరోవైపు ఆవేశం ఉంది. తప్పుదు ఒకచోట అన్యాయం జరుగుతుంటే న్యాయం చేసేదెవరు? ఒకచోట అసత్య ప్రచారం జరుగుతుంటే దాన్ని తప్పు అని చెప్పేవారు ఎవరు? మరోచోట నమ్మకద్రోహం జరిగితే నమ్మేవారెవరు? అవమానం జరిగితే అర్థం చేసుకునేవారెవరు? నిరాదరణకు నోచుకుంటే ఆదరించేవారెవరు? దు:ఖం ఆగకుండా వస్తుంటే కనీసం వినేవారెవరు? ఓదార్చేవారెవరు? ఎవరూ ఉండరు. లేనివాడిది శరీరం కాదు. ఆకలి కాదు. అన్యాయం అసలే కాదు అనే తీరులో సాగుతున్నాయి నేటి జీవితాలు. ఒక విధంగా సమాజం అంటే మనమే. వ్యక్తుల సమూహంలో నువ్వు ఉన్నావు. నేను ఉన్నాను. మన మధ్య ఎందుకిన్ని సంఘటనలు, సంఘర్షణలు? అని ఆలోచించేవారెవరు? సమాజంలోకి అడుగు పెడితే చాలు మళ్ళీ ఆ అడుగు ఇంటిగుమ్మంలో పడేదాకా భయమే.. అపనమ్మకమే. అనుమానమే. ఏం చేయాలి? ఏం చేయాలి? అనే ప్రశ్నలు నిరంతరం మనచుట్టూ వైఫైలా తిరుగుతూనే ఉన్నాయి. కాకుంటే డబ్బు, పరపతి ఉంటే చాలు లేని న్యాయం నడుచుకుంటూ ఇంటికే వచ్చేస్తోంది. ఇవన్నీ చూస్తూ వదిలేసేవారు అనేకమంది ఉంటే వాటిపై పోరాటం చేసేవాడు కవి. నిలదీసి ప్రశ్నించేవాడు ఖచ్చితంగా కవే అని తెలిపే దీర్ఘకవిత ఇది.

పదం దగ్ధమవుతుంటే వాక్యాలన్నీ స్వాంతన పరచాలని పోరాడే కవిత్వం ఇది. **"నువ్వు మమ్మల్ని కావాలనుకుంటే / మేమూ నీవు కావాలనుకుంటాం/ నీవు మమ్మల్ని వద్దనుకుంటే/ మేమూ నీవు అక్కర్లేదనుకుంటాం/ మా దారి మేం చూసుకుంటాం/ మా సుఖాలు మేం వెదుక్కుంటాం"** అనే నిర్లిప్తత, కొన్ని నిద్రరాత్రుల్ని బహిష్కరించుకున్నాక/ **రహస్యాల్ని తిలకంలా దిద్దుకున్న రోజులు/ ఎటో తప్పిపోయాయని గ్రహించుకున్నాక/ ఆరడుగుల దేహాన్ని చీల్చి/ మౌనంగా ప్రార్థించుకుంటూ కూర్చున్నాక/ జీవితం ఎంత నరకప్రాయమో/ కాలం ఎంత కఠోర శిక్షో!"** అనే తాత్త్వికత, ఒక నక్షత్రం రాలినంత మాత్రాన /ఆకాశం చిన్నబోదు కదా!/ ఒక పువ్వు వాడినంత మాత్రాన/ బృందావనం బోసిపోదు/ చీడపట్టిన కొమ్మను నరికేయాలి/ రసిపట్టిన పుండును చిదిమేయాలి/ జీవన సూరతం ఒకటే /చీలిన పాయను నది పట్టించుకోదు/ వాడిన పువ్వుపై తుమ్మెద వాలదు" అనే విముఖత, **"ఓ దేశ నభస్సుపై వెలిగే / సూర్యచంద్రులు ఉపాధ్యాయులు/ ఉపాధ్యాయుడంటే ఓ మమతల కోవెల/ మందుటెడారిలో పున్నమి వెన్నెల"** అనే వాస్తవికత కలగలిపిన హృదయవేదనకు అక్షర రూపం ఏటూరు నాగేంద్రరావు గారి దీర్ఘకవిత దగ్ధ పల్లవుల పాట.

ఒక రాయి ఎన్ని ఉలి దెబ్బలు తింటే భగవంతుని రూపం పొందుతుందో తెలియని వారు లేరు. కానీ భగవంతుడికే రూపాన్నిచ్చిన ఆ శిల్పి ఎన్ని రోజులు పస్తులున్నాడో అనే విషయం మాత్రం ఎవరికీ తెలియదు. తప్పదు. ఇది రంగుల లోకం. మనది అంధ మనస్తత్వం.

ప్రతులకు: ఏటూరి నాగేంద్రరావు
ఫోన్: 89198 51069
వెల: 60/-



సమీక్షకులు:
**-శైలజామిత్ర**
9290900879

## రేపటి భయం

మొన్న
చాలా చాలా బాగుంది
రాత్రి లేదు అంతా పగలే
నిన్న
పర్వాలేదు బాగుంది
చీకట్లు లేవు వెన్నెల కాసింది
నేడు
ఏం బాగులేదు అంతా చీకటి
వెలుగు మాయ అభివృద్ధి మాయ
అన్నీ అమావాస్య రోజులే
దేశంలో
ఖాళీకుండలు చప్పుడు వినిపిస్తుందని
నిపుణులంటున్నారు
మాటల మంత్రంలో అంతా మాయ
తూటాల శబ్దంలో భయంనీడ
పేదరికం పెరిగిందని
ఖజానా ఖాళీ ఖాళీ అని
ఆర్థిక శాస్త్రజ్ఞుల అంచనా
అంతా వెదురు బొంగుమాట
మేడిపండు వేట
కాగితం పూల ఆట
బొమ్మలపై తూటా
వీరత్వం నశిస్తున్న మట్టిలో
మాటల గారడీ మాయ
రేపు ఏమవుతుంది?
భయం
భయంగా వుంది.



**-సి.హెచ్. మధు**
9949486122

## పుస్తక మొగ్గలు

విశ్వవిజ్ఞానానికి నెలవులౌతూనే
శాస్త్ర సాంకేతికానికి నిఘంటువులైతాయి
శాస్త్రీయ జ్ఞానసుధలు పుస్తకాలు

అనుభవానికి ఆధారలైతూనే
అనుభూతికి నిదర్శనమై నిలుస్తున్నాయి
అనుభవ అనుభూతుల కల్పతరువు పుస్తకం

పుస్తకాలు ఎంత పాతవైపోయినా
జ్ఞానానికి పునాదిరాళ్ళు అవుతాయి
పుస్తకాలు మనిషికి జ్ఞానబాండాగారాలు

చెయ్యితో పట్టుకునే పత్రాలవుతూనే
ప్రపంచాన్ని కండ్లముందు దించుతాయి
పుస్తకాలు విశ్వాన్ని చూపించే తొవ్వ

పుస్తకాలు నిత్యం రోడ్లపై దర్శనమిస్తూనే
విద్యార్థుల్లో సృజనాత్మకతకు పదును పెడతాయి
పుస్తకాలు జ్ఞానాన్ని వెదజల్లే కుసుమాలు

పుస్తకాలు జ్ఞానానికి మూలమవుతూనే
విజ్ఞానజ్యోతికి చమురు అవుతాయి
జ్ఞాననిధికి ఆలయాలు పుస్తకాలు

పుస్తకాలు పూర్వచరిత్రను వివరిస్తూనే
నూతన సాహిత్యానికి మార్గదర్శకమవుతాయి
పుస్తకాలు గతానికి వర్తమానానికి వారధులు

మన జ్ఞానానికి చైతన్య దీపికలవుతూనే
మంచిమిత్రులుగా మిగిలిపోతున్నాయి
పుస్తకాలతో సంబంధం పూర్వజన్మ సుకృతం

పుస్తకాలు అరిగి చినిగిపోతూ ఉన్నా
మన విజయానికి తోడ్పడే సాధనలౌతాయి
పుస్తకాలు ఎన్నడు వాడని ఆత్మీయనేస్తాలు

ఉద్యమాలకు ఊపిరిలూదుతూనే
నిరంకుశత్వాన్ని ఎదిరించే పిడికిళ్లవుతాయి
పుస్తకాలు విప్లవచైతన్యపు నినాదాలు

మూఢనమ్మకాలను సదా వ్యతిరేకిస్తూనే
శాస్త్రీయ విజ్ఞానానికి బీజాలేస్తాయి
పుస్తకాలు మనిషిని మానవత్వం వైపు నడిపిస్తాయి



**-ఉప్పరి తిరుమలేష్**
9618961384

**నేటినిజం** చందా వివరాలు

ప్రతి వారం ప్రచురిస్తున్న 'సాహితీ కెరటాలు' గల 'నేటినిజం' 260 సంచికలు + పోస్టల్ ఛార్జీలు కలుపు కుని **5** సం॥రాలకు రూ.**700/-**, **10** సం॥రాలకు రూ **1200/-** మీ చందాను 'నేటినిజం' తెలుగు దినపత్రిక పేరిట ఎం.ఓ. లేదా డిడిగానీ, ఈ క్రింది అడ్రసుకు పంపగలరు.

'నేటినిజం' దినపత్రిక, ఎస్ఆర్‌టి-74,
జవహర్‌నగర్,
హైదరాబాద్-500 020.

# దళిత పోరాటాలకు దిక్సూచి

## 'ఒక అస్పృశ్యుని యుద్ధగాథ' పుస్తకావిష్కరణ సభలో వక్తలు






'ఒక అస్పృశ్యుని యుద్ధగాథ" పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డా॥ చలం, డాక్టర్ సమరం, వి. శ్రీనివాసరావు, కె. రామచంద్రమూర్తి, ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్, డాక్టర్ కత్తి పద్మారావు తదితరులు. ● సభలో ప్రసంగిస్తున్న డా॥ కత్తి పద్మారావు.

దేశంలో తొలిసారిగా డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ హ్యూమనిజాన్ని పూర్తిగా అధ్యయనం చేస్తే డాక్టర్ కత్తి పద్మారావు ఆయన అడుగుజాడల్లో దళిత జాతి కోసం సాగిస్తున్న ఉద్యమం మహోన్నతమైనదంటూ దళిత మహా సభ ఆధ్వర్యంలో ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో పలు రంగాల ప్రముఖులు శ్లాఘించారు. ఈ సందర్భంగా ఆయన రచించిన 'ఒక అస్పృశ్యుని యుద్ధ గాథ' పుస్తకావిష్కరణ జరిగింది. ఈ గ్రంథం భవిష్యత్‌లో కూడా సమసమాజ నిర్మాణంకు దీప స్తంభంగా నిలుస్తుందని అన్నారు. తొలుత ఈ గ్రంథాన్ని యుపీఎస్సీ మెంబర్ ప్రొఫెసర్ కేఎస్ చలం, నాస్తిక కేంద్రం నిర్వాహకులు డాక్టర్ జీ సమరం ఆవిష్కరించారు. డాక్టర్ జీ సమరం మాట్లాడుతూ అస్పృశ్యతనేది క్యాన్సర్, ఎయిడ్స్, కుష్టు వ్యాధుల కంటే అత్యంత భయంకరమైనదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కే. రామచంద్రమూర్తి మాట్లాడుతూ పద్మారావు నడిపిన కారంచేడు, చుండూరు దళిత ఉద్యమాలతో దళిత రాజకీయాలు, దళిత సాహిత్యం తెరపైకి వచ్చాయని అన్నారు. ప్రొఫెసర్ చలం మాట్లాడుతూ కారంచేడు, చుండూరు ఉద్యమాలకు ఆయన అలుపెరుగని నాయకత్వం వహించారని అన్నారు. దళిత ఉపకులాల మధ్య ఐక్యత పెరిగినప్పుడే ఆ జాతి అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఆయన ప్రతి మాటలోనూ ఉద్యమాస్ఫూర్తి ఉంటుందన్నారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు వీ. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇది పద్మారావు జీవితగాథ కథని వర్తమాన ఆంధ్రప్రదేశ్ చరిత్రయని, భావితరాలకు ఈ గ్రంథం ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. అరసం అధ్యక్షులు రాజపాళెం రామచంద్రరెడ్డి మాట్లాడుతూ పద్మారావు రచనలో స్త్రీకి గౌరవనీయమైన పాత్ర ఉంటుందన్నారు. చివరగా గ్రంథ రచయిత కత్తి పద్మారావు మాట్లాడుతూ దళితుల గాథ నుండి ఈ గ్రంథం పుట్టిందన్నారు. ఏళ్ల తరబడి నుంచి నిశ్శబ్ద సమాజంలో దళితులు మగ్గుతున్నారంటూ తనకున్న దానితో తృప్తి పడిదేశాన్ని జయించగల్గేది ఒక్క దళిత జాతి మాత్రమేనన్నారు.

1953 నుండి తాను గమనించిన అంటరానితనం, కుల, మత విద్వేషాల విశేషాలు, విద్యాభ్యాసంలో తాను ఎదుర్కొన్న వివక్ష, దళిత మహిళలు ఎదుర్కొన్న సమస్యలు దళితుల్ని సభ్యసమాజం అణగదొక్కిన విధానాలన్నింటినీ పుస్తకంలో పొందుపర్చానని అన్నారు. దళితుల అభ్యున్నతికి తాను రాసిన పుస్తకం మార్గదర్శకంగా, దిక్సూచిగా ఉపయోగపడాలన్నదే తన లక్ష్యం అని స్పష్టం చేశారు. ఇది మొదటి భాగమేనని మరో మూడు భాగాలు ప్రచురణ కావాల్సి ఉందని వాటిని త్వరలోనే ప్రచురిస్తామని తెలిపారు. మానవత్వం వికసించాలి, కుల, మత అంతరాలు తొలగిపోవాలనే తన కాంక్ష, మార్గదర్శకాలు పుస్తకంలో ఉంటాయని, ప్రతి ఒక్కరూ ఈ పుస్తకాన్ని చదవాలని కాంక్షించారు. డాక్టర్ కనపర్తి అబ్రహాంలింకన్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో హేతువాద ఉద్యమ నేత వల్లంపట్ల నాగేశ్వరరావు, హైదరాబాద్ సెంట్రల్ వర్శిటీ ప్రొఫెసర్ కేవై. రత్నం, లోకాయుక్త ప్రచురణకర్త కత్తి చేతన, సాహితివేత్త కోశాయి కోటేశ్వరరావు, విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి ఉప్పులేటి దేవిప్రసాద్, ప్రొఫెసర్ చందు సుబ్బారావు, ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ నాయకులు, కార్యకర్తలు, పద్మారావు కుటుంబ సభ్యులు, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్రమాలాద్రి, జైభీం బాలకృష్ణ, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఆదివారం జరిగిన సభలో 'ఫరిస్తాలోకం' కవితా సంపుటి రచయిత ఎన్వీ రఘువీర్ ప్రతాప్‌ను సత్కరిస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డా॥కె.వి.రమణాచారి. వేదికపై గజవెల్లి, పెద్దూరి వెంకటదాసు, బైస దేవదాసు, ఆచార్య త్రిమూర్తుల గౌరీశంకర్, ఎన్. శ్రీనివాసుల రెడ్డి. వై. రమాప్రభ.



త్యాగరాయ గానసభలో ఆదివారం ఎన్వీ రఘువీర్ ప్రతాప్ రెక్కల కవితా సంపుటి "ఫరిస్తాలోకం" ఆవిష్కరణలో జరిగిన కవి సమ్మేళనంలో కొల్లాపూర్ విమల, మద్దిలేటి, డి. కృష్ణయ్య, ఆమని కృష్ణ, వేదార్థం మధుసూదనశర్మ, మేనకత్ రాందాస్ నాయక్, పోల సాయిజ్యోతి, మామిళ్ల రాజశేఖర్, హైదరాబాద్ నుంచి గజవెల్లి దశరథరామయ్య, తంగిరాల చక్రవర్తి, అనంతోజు మోహనకృష్ణ, గుళ్ళపల్లి ఆంజనేయులు, సుతారపు వెంకటనారాయణ, దైవాదీనం, బొడ్డు మహేందర్, ప్రకాశ్ వనసకర్ల ఉప్పల రాధాకృష్ణ, కందుకూరి శ్రీరాములు, అశ్రుజల రమణారెడ్డి, పట్టాల అశోక్, మందాడి గోపీనాథ్‌లు పాల్గొన్నారు.



# అనుభవాలు పాఠాలు-4

## నువ్వు తీసుకుంటున్న డబ్బు నీది.. కానీ నేనిచ్చే డబ్బు నాది కాదు

*ప్రతి వ్యక్తీ, ఈ అనంత జన ప్రవాహంలో 'సమూహంలో ఒకడు'గా జీవిస్తున్నవాడే!*

*ప్రతివ్యక్తీ, రోజూ ఏవేవో కొత్త అనుభవాల్ని ప్రోవు చేసుకుంటున్నవాడే!*

*ప్రతివ్యక్తీ, బ్రతుకుబడిలో పాఠాలు నేర్చుకుంటున్న విద్యార్థే!*

*ఆ వ్యక్తిని ఆవరించుకుని తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు, సహాధ్యాయిలు, ఉపాధ్యాయులు, ఉద్యోగంలో చేరాక పై అధికారి, సహ ఉద్యోగి, సబార్డినేటులు, ఆ సంస్థతో లావాదేవీలు నడిపే వ్యక్తులు, సంస్థల ప్రతినిధులు, ఇంటిచుట్టూ ఉన్న ఇరుగు పొరుగూ, రోజూ 'వాకింగ్'లో కనబడే పరిచయస్తులు ఇలా వీళ్ళందరితోనూ అనుభవాల్ని ప్రోవుకుంటున్నాడు.*

*ప్రతీ అనుభవం- తనది కావచ్చు లేదా ప్రక్కవారిది కావొచ్చు- లోంచి పాఠాలు నేర్చుకుంటూ ముందుకు సాగటంలోనే విజ్ఞత ఉంది. ఏడున్నర దశకాల కూర చిదబంరం జీవితంలో ఎదురైన అనుభవాలు, వాటిలోంచి నేర్చుకోగలిగే పాఠాలే ఈ "అనుభవాలు-పాఠాలు".*

*- సంపాదకులు*

ఏభయి ఏళ్ళక్రితం భవన నిర్మాణ రంగంలో వాడే సిమెంటు, స్టీలు - ఈ రెండు వస్తువులు 'పర్మిటు' మీద దొరికేవి. వ్యక్తిగతమైన అవసరాలకైనా, లేదా, ఫ్యాక్టరీ నిర్మాణాల్లాంటి అవసరాలకైనా రాష్ట్ర ప్రభుత్వం వారి పరిశ్రమలశాఖ 'పర్మిటు' రూపంగా వీటిని ఎలాట్ చేసేది.

పరిశ్రమల శాఖవారు నిర్దేశించిన కంపెనీ వారి అవుట్‌లెట్‌లో వెళ్ళి పర్మిటు చూపించి, డబ్బులు కట్టి స్వంత ఖర్చులతో వీటిని గమ్యం చేర్చుకోవాలి. ఇదీ ఆనాటి పద్ధతి.

ఫ్యాక్టరీ నిర్మాణంలో ఉన్న ఆ కంపెనీలో నా ఉద్యోగం. అవసరాన్నిబట్టి అన్ని పనులు అంటే ఎక్కౌంట్సు రాయటం, పరిశ్రమల శాఖ నిర్దేశించబడిన స్టీలు సిమెంటు ఫ్యాక్టరీ వారి గోడవున్ల లోంచి లారీ మాట్లాడుకుని నిర్మాణంలో ఉన్న మా ఫ్యాక్టరీకి చేర్పించటం - ఇవీ అవీ అనకుండా అన్నిపనులు చేయాల్సి వచ్చేది. నాతోబాటు మా ఎం.డి. కూడా పనుల్లో పాలు పంచుకునేవాడు.

ఆరోజు నగరానికి పొలిమేరలో ఉన్న స్టీలు కంపెనీ వారి గోడవున్లలోంచి స్టీలు తీసుకువచ్చి ఫ్యాక్టరీ చేర్పించాల్సిన పని నా కప్పగింపబడింది.

దురదృష్టవశాత్తు ఆరోజు లారీల సమ్మె. ఎంతోసేపు ప్రయత్నించిన తరువాతగాని లారీ దొరకలేదు. అదీ మామూలు ధరకంటే ఒకటిన్నర రెట్లు ఎక్కువ.

అయినా సరే అంటూ లారీ మాట్లాడుకున్నాను. స్టీలు ఫ్యాక్టరీ చేరింది.

లారీ డ్రయివర్ ఎందుకనోగాని మాట్లాడుకున్న మొత్తంకంటే ఎక్కువ డిమాండు చేయసాగాడు.

అదేం.. అంటే.. ఏవో.. అర్థం పర్థంలేని కష్టాలు ఇబ్బందులు ఏకరువు పెట్టసాగాడు.

నేను మౌనం వహించాను. కొన్ని కొన్ని సందర్భాల్లో మాటకంటే మౌనమే పరిష్కారం చూపగలుగుతుంది.

డ్రయివర్ ఏదో చెప్పటం.. నేను ఏమీ మాట్లాడకుండా మౌనం వహించటం. ఇలా జరుగుతోంది. నా మౌనం ఆ లారీ డ్రయివర్‌ను తికమకపెడ్తోంది.

స్టీలు లారీనుండి దించారు. మాట్లాడుకున్న మొత్తానికి వోచరు వ్రాసి డ్రయివర్ సంతకానికి ఆయన ముందుంచాను. మళ్ళీ నస

నా మౌనం.

ఆయన అలా వాగీ వాగీ విసుగెత్తినట్లున్నాడు. ఆఖరి అస్త్రం ప్రయోగించాడు.

"ఇట్లా గింజుకుంటావేం సార్! నీ డబ్బేం పోవటంలేదు. కంపెనీ డబ్బే ఇస్తున్నావు కద" అన్నాడు.

దానికి నా జవాబు-

"చూడయ్యా! నీవు తీసుకునే డబ్బు నీది. కాని నేనిచ్చే డబ్బు నాది కాదు. వేరొకరిది. మనం వేరొకరి డబ్బులు వాడుతున్నప్పుడు మన డబ్బు వాడుతున్నదానికంటే జాగ్రత్తగా ఉండాలి. అలా ఉండటం లేదు అంటే... యాజమాన్యం మనల్ని అపార్థం చేసుకుంటుంది. అదీ కాకుండా మనలో అంతరాత్మ అన్నది ఉంటుంది చూసావూ... అది వృథా చెయ్యవద్దని హెచ్చరిస్తుంది" అన్నాను.

నా మాటలు ఆయనకు అర్థం అయ్యాయో లేదో కానీ, ఈయన్తో లాభంలేదు అనుకున్నాడు కాబోలు వోచరుమీద వేలిముద్రవేసి డబ్బు తీసుకుని బయటకు నడిచాడు.



**-కూర చిదంబరం**
సెల్: 8639338675

# పోకిరీలకు దడపుట్టిస్తున్న షీబృందాలు




కరీంనగర్, నవంబర్ 27 (నేటినిజం ప్రతినిధి):కరీంనగర్ కమీషనరేట్ వ్యాప్తంగా షీబృందాలు పోకిరీలకు దడపుట్టిస్తున్నాయి. విద్యార్థినులు, మహిళల్లో భద్రతాభావాన్ని పెంపొందిస్తూ నూతనోత్సాహంతో షీబృందాలు ముందుకుసాగుతున్నాయి. కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి ప్రత్యక్ష పర్యవేక్షణలో కమీషనరేట్ వ్యాప్తంగా 10షీబృందాలు పనిచేస్తున్నాయి. మహిళలు, విద్యార్థినులు పోకిరీల వేధింపులను ఎదుర్కొన్నట్లైతే ఫిర్యాదు చేసే విధానంపై అవగాహన కల్పించేందుకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.2016 అక్టోబర్ 28న కమీషనరేటేలో షీబృందాలు ప్రారంభమైన విషయం విదితమే.మహిళలు, విద్యార్థినిలు పోకిరీల వేధింపులతో కంటతడిపెట్టరావద్దనే అభిమతంతో షీబృందాలు అంకితభావంతో పనిచేస్తున్నాయి. షీబృందాలకు చెందిన పోలీసులు మఫ్టీల్లో సంచరిస్తూ ముఖ్యకూడళ్ళు సంచరిస్తూ పోకిరీలను ఆధారాలతో సహాపట్టుకునేందుకు ఆధునిక సాంకేతక పరకరాలను వినియోగిస్తున్నారు. వేధింపుల తీవ్రతను బట్టి తల్లిదండ్రుల సమక్షంలో ఆధారాలను చూపిస్తూ కౌన్సిలింగ్‌లను నిర్వహించడంతోపాటు నిర్భయ కేసులను నమోదుచేస్తూ షీబృందాలు పోకిరీలకు సింహస్వప్నంగా నిలుస్తున్నాయి. 2016 నుండి ఇప్పటి వరకు షీబృందాలకు 1795మంది పోకిరీలు పట్టుబడ్డారు. ఇందులో 20మందిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయగా, 420మందికి కౌన్సిలింగ్‌లు, వేధింపుల తీవ్రతస్థాయి తక్కువను బట్టి తల్లిదండ్రుల సమక్షంలో య1207మందిని హెచ్చరించి వదిలివేయడం జరిగింది. 2016 నుండి ఈ సంవత్సరం ఈనెల 21వరకు షీబృందాలకు నేరుగా 384ఫిర్యాదులు అందగా, వాట్సాప్‌ద్వారా 45, డయల్ 100ద్వారా 05, ఫేస్‌బుక్‌ద్వారా 05, హాక్ఐ యాప్‌ద్వారా 05 మొత్తం 438 ఫిర్యాదులు అందాయి.

ఆశ్లీలత, వేధింపులపై అవగాహన కార్యక్రమాలు :ప్రతి విద్యాసంస్థలకు షీబృందాలు స్వయంగా వెళుతూ అశ్లీలత, వేధింపుల తీవ్రతపై అవగాహన కల్పిస్తూ విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. ఇప్పటి వరకు కరీంనగర్ కమీషనరేట్ వ్యాప్తంగా 268 కార్యక్రమాలను నిర్వహించారు. వర్కింగ్ ఉమెన్‌హాస్టళ్ళు, వివిధ విద్యాసంస్థలకు వెళ్ళి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పోలీస్‌శాఖ నేరుగా పోలీస్‌స్టేషన్లకు వచ్చి విద్యార్థినిలు, మహిళలు ఫిర్యాదు చేయాల్సిన లేకుండా అందుబాటులోకి తీసుకవచ్చిన హాక్ఐ యాప్‌ను స్మార్ట్‌ఫోన్ కలిగిన ప్రతి విద్యార్థిని, మహిళలతో డౌన్‌లోడ్ చేయిస్తున్నారు. షీటీం ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 64వేల మందితో ఈయాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు.

ముఖ్యకూడళ్ళల్లో షీబృందాలు మఫ్టీల్లో సంచారంహ షీబృందాలకు చెందిన పోలీసులు వేధింపులు జరిగేందుకు ఆస్కారం ఉన్నప్రాంతాల్లో నిఘాను కొనసాగిస్తూ ఆధునిక సాంకేతిక పరికరాల వినియోగం ద్వారా పోకిరీల ఆధారాలను సేకరిస్తూ పట్టుకుంటున్నారు. పట్టుబడిన పోకిరీలను వారి తల్లిదండ్రుల సమక్షంలో ఆధారాలను చూపిస్తూ కౌన్సిలింగ్‌లను నిర్వహిస్తున్నారు. మహిళలు, విద్యార్థినిలు నేరుగా ఫిర్యాదు చేయాల్సిన అవసరం లేకుండా సెల్‌ఫోన్,వాట్సాప్,ట్విట్టర్ ద్వారా ఫిర్యాదులు అందుతున్నాయి. ఫిర్యాదు చేసిన మహిళలు,విద్యార్థుల పేర్లను గోప్యంగా ఉంచడంతోపాటు, వారిని పోలీస్‌స్టేషన్లకు రమ్మనకుండా షీబృందాల పోలీసులు బాధిత మహిళల వద్దకు వెళ్ళి ఫిర్యాదులను స్వీకరిస్తున్నారు.ఈ విధానం ద్వారా మహిళల్లో భద్రతాభావం పెంపొందుతున్నది. 94407 95182కు వాట్సాప్ ఫిర్యాదులు చేసేందుకు ప్రత్యేక నెంబర్‌ను కేటాంచారు. బాధిత మహిళలు, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. వేధింపులు జరిగేందుకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో షీబృందాల పనితీరుతీరుతో తగ్గుముఖం పడుతున్నాయి.

షీబృందాల పనితీరుకు విశేష స్పందన: "కాదేదు కవితకు అనర్హం అన్నట్లు" మహిళ సంచారం ఉన్న ప్రతి ప్రాంతంలో షీబృందాలు అవగాహన నిర్వహిస్తూ ముందుకుసాగుతున్నాయి. షీబృందాల చురుకైన పనితీరుకు విశేషస్పందన లభిస్తున్నది. మహిళల భద్రత కోసం పోలీస్‌శాఖ షీబృందాల ద్వారా తీసుకుంటున్న చర్యలు భద్రతాభావాన్ని పెంపొందిస్తున్నాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం ద్వారా పోకిరీల వేధింపులను ఎదుర్కొంటున్న మహిళలు, విద్యార్థులు బాధితుల వివరాలను గోప్యంగా ఉంచడం వల్ల నిర్భయంగా ఫిర్యాదుచేసేందుకు ముందుకువస్తున్నారు.

ఆత్మరక్షణ కళల్లో మహిళా పోలీసులకు శిక్షణ: కమీషనరేట్‌లోని మహిళా పోలీసు అధికారులు, షీబృందాల్లో పనిచేస్తున్న పోలీసులకు కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి ఆత్మరక్షణ కళల్లో వారం రోజులపాటు శిక్షణ కార్యక్రమాన్ని ఈ సంవత్సరం జనవరి నెలలో నిర్వహించారు. ఒకినోవా మార్షల్‌ఆర్ట్స్ ఛీఫ్ ఇన్స్ట్రక్టర్ వసంత్‌కుమార్ ఆధ్వర్యంలో కరీంనగర్ కమీషనరేట్ కేంద్రంలో ఈ కార్యక్రమం కొనసాగింది. శారీరకంగా, మానసికంగా సంసిద్ధంగా ఉన్నట్లయితే పెద్దయెత్తున మహిళలు పాల్గొనే ఆందోళనలు జరిగిన సందర్భాల్లో అలసట లేకుండా విధులను కొనసాగించరావడంతోపాటు ఆత్మరక్షణ చర్యలు తీసుకునేందుకు ఈకార్యక్రమం దోహదపడింది. కమీషనరేట్‌లోని అన్ని పోలీస్‌స్టేషన్లలో మహిళలకు ప్రత్యేక సౌకర్యాలను కల్పిండంతోపాటు నెలలో రెండురోజులు ప్రత్యేక పరిష్మన్లు ప్రకటించారు. మహిళల సామర్థ్యాలను బట్టి ముఖ్యమైన విధులను నిర్వహించే అవకాశాన్ని ఇస్తామని తెలిపారు. పెట్రోలింగ్ వాహనాల్లో కూడా మహిళలను నియమించారు. శిక్షణ పొందిన మహిళలకు పూర్తిస్థాయి వైద్యపరీక్షలు నిర్వహించారు.

